ప్రజాశక్తి
శనివారం 31 ఆగస్టు 2024
5
శ్రీ సత్యసాయి



చెట్లతోనే మానవ మనుగడ

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి
పెనుకొండలో రూ. 2 కోట్లతో పార్క్
రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

చెట్లను కాపాడు కుంటే మానవ మనుగడకు అవి ప్రాణం పోస్తాయని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. శుక్రవారం నాడు పెనుకొండలోని పూలేకులమ్మ గుడి సమీపంలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ టిఎస్. చేతన్‌తో కలిసి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో రాష్ట్రంలో కోటిన్నర మొక్కలు నాటే కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 25 లక్షల మొక్కలను నాటే లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు చెప్పారు. పచ్చని చెట్లతో మనిషికి ప్రాణాధారమైన ఆక్సిజన్ లభిస్తోందని చెప్పారు. చెట్లను కుటుంబ సభ్యుల మాదిరిగా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశంతోనే ప్రతి కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా మొక్కలు నాటాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచన మేరకు ప్రభుత్వం వన మహోత్సవం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టిందన్నారు. తన కుమారుడి పుట్టినరోజున ప్రతి ఏటా మొక్క నాటిస్తున్నని మంత్రి తెలిపారు. నాటడంతోనే సరిపెట్టకుండా వాటిని సంరక్షిస్తున్నామని తెలిపారు. భావితరాల భవిష్యత్తు మన చేతుల్లోనే ఉందన్నారు. కొందరు అక్రమార్కులు ఇష్టారాజ్యంగా చెట్లు నరకడం వల్ల పర్యావరణం దెబ్బతిని వర్షాలు తగ్గుముఖం పడుతున్నాయని, భూ గర్భ జలాలు ఇంకిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇలాంటి సమయంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ఒక బాధ్యతగా తీసుకోవాలని సూచించారు.



మొక్క నాటిన మంత్రి సవిత, కలెక్టర్ చేతన్

చెట్లు నరికించిన జగన్ : మంత్రి

గడిచిన అయిదేళ్లలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసినట్లే. పర్యావరణాన్ని కూడా నాశనం చేశారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతాయుతమైన స్థానంలో ఉండి పరదాల మాటున పర్యటిస్తూ, చెట్లను విపరీతంగా నరికించారన్నారు. అందుకు భిన్నంగా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖాధికారులు, టీడీపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుకొండలో రూ.2 కోట్లతో పార్కు


పెనుకొండలో రూ.2 కోట్లతో పార్కు నిర్మిస్తున్నట్లు మంత్రి ఎస్.సవిత తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాతూ పార్కులో యోగా సెంటర్ తోపాటు మైదానం, ఫుడ్ కోర్టు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

6న కొండంపల్లి ఎంజెపి బాలికల రెసిడెన్షియల్ స్కూల్ ప్రారంభం

సెప్టెంబర్ 6వ తేదీ నుంచి మండలంలోని రామపురం పంచాయతీ కొండంపల్లిలో ఎంజెపి బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను ప్రారంభిస్తున్నట్లు మంత్రి సవిత తెలిపారు. పెనుకొండలో తాత్కాలిక భవనంలో ప్రారంభం కానున్న ఎంజెపి బాలిక రెసిడెన్షియల్ స్కూల్‌ను శుక్రవారం ఆమె సందర్శించారు. వచ్చే నెల 6వ తేదీ కొండంపల్లిలో తాత్కాలిక భవనంలో ఎంజెపి స్కూల్‌ను ప్రారంభిస్తామని, అందుకు అసరమైన సిబ్బందిని నియమించారని మంత్రి తెలిపారు.

సిఫార్సుల బదిలీలు..!

రాష్ట్రంలో ప్రభుత్వం మారిన అనంతరం ప్రభుత్వ అధికారుల పూర్తి స్థాయి బదిలీల కార్యక్రమం ప్రస్తుతం కొనసాగుతోంది. ఇప్పటికే బదిలీలకు సంబంధించిన దరఖాస్తులను అధికారులు ఆన్‌లైన్‌లో సమర్పించారు. తమకు కావాల్సిన స్థానానికి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వారికి అనుకూలమైన చోట స్థానం సంపాదించేందుకు అన్ని దారులను వెతుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రజాప్రతినిధుల వద్దకు సిఫార్సు లేఖలతో క్యూ కడుతున్నారు. వారికి పరిచయం ఉన్న దిగువ స్థాయి నాయకులను వెంటబెట్టుకుని ముఖ్య ప్రజాప్రతినిధి వద్దకు వెళ్తున్నారు.



- ప్రజాప్రతినిధుల వద్దకు అధికారుల క్యూ
- అనువైన స్థానం పొందేలా పైరవీలు
- రెవెన్యూ శాఖలో పెద్ద డిమాండ్
- చేతులు మారుతున్న నగదు

ప్రజాశక్తి-అనంతపురం

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ముఖ్యమైన అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ బదిలీల ప్రక్రియ జరుగుతోంది. ప్రస్తుతం అధికారులు అందరూ కూడా ఇదే పనిలో ఉన్నారు. ఆయా కార్యాలయాల్లో రోజు వారీ కార్యక్రమాలకు బ్రేక్ ఇచ్చి పోస్టింగ్‌పైనే దృష్టి సారించారు. బదిలీల ప్రక్రియ ప్రారంభం అయినప్పటి నుంచి రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, హౌసింగ్ శాఖల ఉద్యోగులు, సిబ్బందిలో గుబులు మొదలైంది. ఆయా శాఖల్లో ఈఈ, డీఈఈ, జెఈ తదితర పోస్టుల ఎక్కువగా ఖాళీగా ఉండడంతో ఆ స్థానాల్లోనే బదిలీల ప్రక్రియకు పోటీ పెరిగింది.

సిఫార్సు లేఖలతో హడావుడి

బదిలీల కోసం ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు తెచ్చుకుంటున్నారు. చాలా మంది రాష్ట్ర కేంద్రంలో మంత్రుల పేషీకి వెళ్లి వారి సాదకబాధలను విన్నిస్తున్నారు. రెవెన్యూ, ఎంపిడిఒ తదితర ప్రాధాన్యత శాఖలకు సంబంధించి ఒక్కో పోస్టుకు మూడు నుంచి ఆరు వరకు ముఖ్య ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సులు అందినట్లు సమాచారం. పెద్ద ఎత్తున సిఫార్సు లేఖలు రావడంతో ఎవరికి పోస్టింగ్ ఇవ్వాలనే దానిపై ఉన్నతాధికారుల్లోనూ సందిగ్ధత నెలకొంది. ఓ వైపు నిబంధనలు పాటిస్తూనే మరో వైపు సిఫార్సు లేఖలను ప్రామాణికంగా తీసుకోవడం ఉన్నతాధికారులకు తలకుమించిన భారంగా మారింది. పోటీలేని చోటు బదిలీల ప్రక్రియ సాఫీగా జరిగేందుకు వీలున్నా, పోటీ ఎక్కువగా ఉన్న స్థానాల్లో మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుత బదిలీల ప్రక్రియలో ఒక స్థానంలో ఐదేళ్ల పూర్తి చేసుకున్న వారికి తప్పనిసరిగా బదిలీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో గడిచిన ఐదేళుగా ఒకే స్థానంలో పని చేస్తున్న వారు చాలా మందే ఉన్నారు. ప్రభుత్వ నిబంధనల సంగతి అటుంచితే చాలా రోజుల నుంచి ఒకే స్థానంలో పని చేస్తున్న అధికారులు కూడా బదిలీ కోరుకుంటున్నారు. అయితే ఏ స్థానంకు వెళ్తే తమ విధులకు, కుటుంబానికి మేలు జరుగుతుందనే భావనలో ఉన్నారు. దరఖాస్తుల అనంతరం ఈ నెల 31వ తేదీన బదిలీల జాబితా విడుదల అవుతుందని తెలుస్తోంది. ఇప్పటికే బదిలీలు కోరుకునే వారు ఆయా శాఖల హెచ్ఒడిలకు విజ్ఞాపనలు పంపారు. ఉన్నతాధికారులు వీటిని పరిశీలించే పనిలో పడ్డారు. సిఫార్సుల పోటీ ఎక్కువగా ఉన్న స్థానాల బదిలీల విషయంలో అధికారులకు సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ఒకరికి మేలు చేస్తే మరొకరికి ఇబ్బంది కలగక మానదు. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరి దృష్టిలోనూ చెడు కాకుండా బదిలీ ప్రక్రియను నిర్వహించేలా ఉన్నతాధికారులు కూడా కసరత్తు చేస్తున్నారు.

రెవెన్యూకు డిమాండ్

రెవెన్యూ శాఖలో బదిలీలకు భారీగానే డిమాండ్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల తహాశీల్దార్ల బదిలీలు పూర్తయ్యాయి. ప్రస్తుతం వారి కింది స్థాయి ఉద్యోగుల బదిలీలు జరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో వీరంతా ఏదో ఒక రూపంలో వైసిపి ప్రభుత్వానికి సానుకూలంగా ఉన్న వారే. ప్రభుత్వం మారడంతో వీరంతా కూటమి నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. బదిలీల్లో తమ పేర్లను పరిశీలించి న్యాయం చేయాలని విజ్ఞపనలు అందించారు.

చేతులు మారుతున్న ముడుపులు

కోరుకున్న చోట తమకు పోస్టింగ్ ఇప్పిస్తే పెద్ద మొత్తంలోనే డబ్బులు ఇచ్చేందుకు కొందరు అధికారులు సిద్ధం అయ్యారు. ఈ పరిస్థితి రెవెన్యూ శాఖలో ఎక్కువగా కన్పిస్తోంది. నచ్చిన చోట పోస్టింగ్ తెచ్చుకునేందుకు అధికార పార్టీ ద్వితీయ శ్రేణి నాయకుల ద్వారా అధికారులు కథ నడుపుతున్నారు. సందట్లో సడేమియా అన్నట్లు నాయకులు కూడా బదిలీల మాటున పెద్ద ఎత్తున ముడుపులు తీసుకుంటున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఎమ్మెల్యే, మంత్రుల వద్దకు బదిలీ కోరుకుంటున్న ఉద్యోగులను తీసుకెళ్లి తమకు బాగా కావాల్సిన ఉద్యోగికి అని, మీ పరిధిలో పోస్టింగ్ ఇస్తే మీకు నచ్చిన నట్టు పని చేస్తారని చెబుతున్నారు. మంత్రులు, ఎమ్మెల్యే ఇలా వస్తున్న వారందరికీ చూద్దాం.. చేద్దాం.. అని చెప్పి పంపుతున్నారు. ఉద్యోగుల బదిలీలను పర్యవేక్షించే అధికారులు కూడా పెద్ద మొత్తంలోనే బదిలీల అంశంలో డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఓవైపు నాయకులు, మరో వైపు ఉన్నతాధికారులు ఇద్దరికీ ముడుపులు ఇవ్వాల్సి రావడంతో బదిలీ కోరుకునే ఉద్యోగులకు చేతిచమురు బాగానే వదులుతోంది. గతంలో వైసిపి నాయకులతో అంటగాగిని వారు సైతం కూటమి ద్వితీయ శ్రేణి నాయకుల ద్వారా వారు అనుకున్న స్థానానికి వెళ్లేలా సిఫార్సు లేఖలు తెచ్చుకుంటున్నారు. ఇలాంటి వారికి సిఫార్సు లేఖలు ఇచ్చే సమయంలో పెద్ద మొత్తంలో ముడుపులు చేతులు మారుతున్నట్లు సమాచారం. మొత్తం మీద బదిలీల పర్వం అటు నాయకులు, ఇటు ముఖ్య అధికారులకు కాసుల పంటగానే మారింది.

సిఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

రాష్ట్ర సచివాలయంలోని సిఎం కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సిఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల గుండుమల గ్రామంలో నిర్వహించిన చంద్రన్న పింఛన్ల పండుగ కార్యక్రమంలో భాగంలో అడిగిన నియోజకవర్గ అభివృద్ధి పనులను మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. సిఎం చంద్రబాబు మారుమూల ప్రాంతమైన ఎస్సీ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించి అడిగిన సంక్షేమ కార్యక్రమాలను మంజూరు చేయడం పట్ల ఎమ్మెల్యే ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న శాశ్వత సమస్యల పరిష్కారానికి సిఎం చంద్రబాబు ఆమోదం తెలిపారన్నారు.



రాష్ట్ర సచివాలయంలో సిఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

ఇంజినీరింగ్ విద్యార్థినికి ల్యాప్‌టాప్ వితరణ

గుడిబండ మండలంలోని బైరేపల్లి దళితవాడకు చెందిన చైత్ర అనంతపురం నగరంలోని ఓ కళాశాలలో ఇంజినీరింగ్ నాల్గవ సంవత్సరం చదువుతోంది. ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితులు తెలుసుకున్న ఎమ్మెల్యే సొంత నిధులతో చైత్రకు ల్యాప్ టాప్ అందజేశారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే చైత్రకు సూచించారు.

ప్రజల గుండెల్లో చెరగని ముద్ర పరిటాల రవి

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

పరిటాల రవీంద్ర మృతి చెంది ఇన్నేళ్లయినా ప్రజలు ఇంకా గుండెల్లో పెట్టుకున్నారని ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ తెలిపారు. మాజీ మంత్రి పరిటాల రవీంద్ర జయంతి సందర్భంగా శుక్రవారం రామగిరి మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఉన్న పరిటాల రవి ఘాట్ వద్ద పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ పరిటాల రవి ప్రతి జయంతి, వర్ధంతి కార్యక్రమాలకు అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి తమ అభిమానం చాటుకుంటున్నా రన్నారు. రవి ఆశయాలను శ్రీరామ్ కొనసాగిస్తారని సునీత తెలిపారు. రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాలను సస్యశ్యామలం చేయడమే తమ లక్ష్యమని వారు తెలిపారు. రవి చేపట్టిన సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని శ్రీరామ్ స్పష్టం చేశారు. అలాగే వేలాదిగా తరలివచ్చిన అభిమానులు ఘాట్ వద్ద నివాళులర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావడంతో వెంకటాపురంలో సందడి వాతావరణం నెలకొంది. ఇక ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టిడిపి శ్రేణులు, అభిమానులు పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు, విరాళాలు అందజేశారు.

పెనుకొండ : మాజీ మంత్రి పరిటాల రవీంద్ర జయంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని అన్న క్యాంటీన్ వద్ద మంత్రి సవిత పరిటాల రవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్డు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ స్వామి, మాధవనాయుడు, మండల, పట్టణ పార్టీ కన్వీనర్లు సిద్దయ్య, శ్రీరాములుయాదవ్, లక్ష్మీనారాయణరెడ్డి, సూర్యనారాయణ, బాబుల్‌రెడ్డి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్



వెంకటాపురంలో పరిటాల రవి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న పరిటాల సునీత, శ్రీరామ్, కుటుంబ సభ్యులు

గవర్నర్‌ను కలిసిన ఎమ్మెల్యే కందికుంట

కదిరి టౌన్ : విజయవాడలోని రాజ్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శుక్రవారం నాడు మర్యాదపూర్వకంగా కలిశారు. కదిరి నియోజకవర్గం సమస్యలను గవర్నర్‌కు వివరించారు.



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

రేపు శ్రీకృష్ణాష్టమి వేడుకలు

గుడిబండ : మడకశిర పట్టణంలోని యాదవ కళ్యాణ మండపంలో సెప్టెంబర్ 1వ తేదీ నిర్వహిస్తున్న శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో యాదవ కులస్తులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని రవీంద్ర కాన్వెంట్ కరస్పాండెంట్ రాజు ఓ ప్రకటనలో కోరారు. సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరారెడ్డి, గుండుమల తిప్పేస్వామి, ఎమ్మెల్యే రాజు, ఎంపి పార్థసారధి హాజరై ప్రతిభావంత విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తారని తెలిపారు.

తహాశీల్దార్ కార్యాలయానికి తాళం

న్యాయం చేయాలని గదిబయట కూర్చొని ఆందోళన
విఆర్‌ఒను సస్పెండ్ చేయాలని డిమాండ్



తహాశీల్దార్ కార్యాలయానికి తాళం వేసి తలుపు ముందు బైఠాయించిన రైతు రమేష్

ప్రజాశక్తి-పెనుకొండ

రెవెన్యూ కోర్టు పరిధిలో ఉన్న భూమి రికార్డులు మాయం చేసి పెత్తందారులకు వత్తాసు పలుకుతున్న విఆర్‌ఒను సస్పెండ్ చేసి, తనకు న్యాయం చేయాలని కోరుతూ ఓ రైతు పెనుకొండ తహాశీల్దార్ కార్యాలయానికి శుక్రవారం ఉదయం తాళం వేసి నిరసన తెలిపారు. ఇందుకు సంబంధించి బాధితుడు రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... పెనుకొండ నగరపంచాయతీ వెంకటరెడ్డిపల్లికి చెందిన రమేష్, మరో ముగ్గురుకు చెందిన సర్వేనెంబర్ 1121-12లో 1.94 ఎకరాల భూమి వివాదం రెవెన్యూ కోర్టు పరిధిలో ఉందన్నారు. విఆర్ఒ గంగాధర్ ఈ భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డును మాయం చేసి గ్రామానికి చెందిన శీనప్ప అనే వ్యక్తికి పట్టా చేశారని తెలిపారు. తహాశీల్దార్, డిప్యూటీ తహాశీల్దార్లు భూమికి సంబంధించిన రిపోర్టు తయారు చేయాలని వీఆర్వోను ఆదేశిస్తే ఆయన నిర్లక్ష్యం చేస్తూ 15 రోజులుగా ఇబ్బంది పెడుతున్నానని వాపోయారు. తనకు జరుగుతున్న అన్యాయంపై ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతూ తహాశీల్దార్ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపానన్నారు. రికార్డులను మాయం చేసి వేరే వ్యక్తికి భూమి ఇచ్చేలా కుట్ర చేస్తున్న వీఆర్వోను తక్షణం విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. తన భూమి తనకు దక్కేలా న్యాయం చేయాలని కోరాడు. తహాశీల్దార్ కార్యాలయం వద్ద వ్యక్తి ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. బాధిత రైతు రమేష్‌తో మాట్లాడారు. రికార్డులను పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆయన ఆందోళన విరమించారు.

రోడ్డుపై మురుగు.. రోగాల బారిన ప్రజలు

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని బూదిలి గ్రామంలో రోడ్డుపైనే మురుగునీరు పారుతుండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గ్రామంలో డ్రెయినేజీ కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు వృద్ధి చెంది ఆసుపత్రుల పాలవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీ కాలువలు శుభ్రం చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని వాపోయారు. ఇకనైనా అధికారులు స్పందించి గ్రామంలో డ్రెయినేజీ కాలువల్లో పేరుకుపోయిన పూడిక, చెత్తచెదారం తొలగించాలని, గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు



బూదిలిలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రమాద సూచికలు ఏర్పాటు

రొద్దం : రెండు రోజుల క్రితం ప్రజాశక్తి దినపత్రికలో 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికతో ఓ కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు పైపులైన్ కోసం తీసిన గుంత వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేశారు. డిడిఒ రమేష్ మాట్లాడుతూ తాగునీటి పైపులైన్ మరమ్మతుల కోసం గుంతలు తీశారని, అయితే పైపులైన్‌కు అవసరమైన వస్తువులు అందుబాటులో లేకపోవడంతో పనులు ఆలస్యమయ్యాయని తెలిపారు. రెండు రోజుల్లో పనులు పూర్తి చేసి గుంతలు పూడ్చి వేయిస్తామని తెలిపారు.



పైపులైన్ గుంత వద్ద ఏర్పాటు చేసిన ప్రమాద సూచికలు

ఓపీఎస్ అమలు చేయాల్సిందే..!

యుపిఎస్‌ను వ్యతిరేకిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసనలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ స్కీం(ఓపిఎస్)ను అమలు చేయాల్సిందే అని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరుతూ శుక్రవారం నాడు జిల్లాలోని తాలూకా, డివిజన్ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలను చేపట్టారు. ఆయా తహశీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళన చేపట్టిన అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ధర్మవరంలో జరిగిన కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యూనిఫైడ్ పెన్షన్ స్కీం(యుపిఎస్), గ్యారెంటీ పెన్షన్ స్కీమ్(జిపిఎస్), కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సిపిఎస్) తదితర వాటిని అన్నింటినీ రద్దుచేసి పాత పెన్షన్ విధానం(ఓపిఎస్)ను మాత్రమే అమలు చేయాలన్నారు. ఉద్యోగులకు పెన్షన్ భిక్ష కాదు హక్కు అని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పాలకపక్షాలు గుర్తించాలన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం యునిఫైడ్ పెన్షన్ స్కీమ్ తీసుకు రావడం దారుణమన్నారు. రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలలను బలోపేతానికి విఘాతం కలిగించేలా ఉన్న 117 జీవోను రద్దు చేయాలన్నారు. వర్క్ అడ్జస్ట్‌మెంట్ మండల స్థాయిలో కాకుండా డివిజన్ స్థాయిలో నిర్వహించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం డివిజన్ యుటిఎఫ్ నాయకులు రామకృష్ణ నాయక్, లక్ష్మయ్య, ఆంజనేయులు, అమర్ నారాయణరెడ్డి, హరికృష్ణ, సాయి గణేష్, రాంప్రసాద్, సకల చంద్రశేఖర్, బిల్లె రామాంజినేయులు, ఆంజనేయులు, జనార్ధన్ బాబు, కృష్ణతేజ, బాలాజీ, నారాయణ స్వామి, సురేష్ పాల్గొన్నారు.

పెనుకొండ : యుపిఎస్‌ను వ్యతిరేకిస్తూ శుక్రవారం యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ తహశీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, నారాయణస్వామి రమేష్, ఉపేంద్ర, రవీంద్రనాథ్, కృష్ణానాయక్, రామాంజనేయులు, గోవిందప్ప, రాజాగోపాల్, శేషాద్రి, వెంకటేష్, ఆదిజినేష్, నరేష్, ప్రభాకర్, డిప్యూటీ తహశీల్దార్ హనుమంతు, లీలావతి, జగన్, తరుణ్, ఉదయ్ పాల్గొన్నారు.

మడకశిర : యుపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ మడకశిర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వివిఎన్. మాలింగప్ప, వై.జోగప్ప ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ నేలకోటప్ప, జూనియర్ అసిస్టెంట్ శాంతిలకు వినతిపత్రా లు ఇచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.భూతన్న, నాయకులు టి.మూడ్లగిరియప్ప, బి.ఈశ్వర్, కదిరన్న, ఈ.నరసింహమూర్తి, రొళ్ల యుటిఎఫ్ నాయకులు అనిల్‌కుమార్, నారాయణ స్వామి, మహంతేష్, దత్తాత్రేయ, దేవరాజు, నరసింహరాజు, నంజప్ప, మల్లికార్జున, రంగనాథ్, నగేష్ పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : యుపిఎస్‌ను వ్యతిరేకిస్తూ యుటిఎఫ్ శుక్రవారం నిరసన వ్యక్తం చేసింది. ఆసంఘం జిల్లా కార్యదర్శి శివా కందుకూరి, లక్ష్మి నారాయణ ఆధ్వర్యంలో పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో భాగ్యరేఖకి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్ , రవీంద్ర రెడ్డి, సురేష్, బాబావాలి, బాబయ్య, య్య, కిష్టా,రాజేష్ నాయక్ పాల్గొన్నారు.

కదిరి టౌన్ : పాత పెన్షన్ విధానం ఉద్యోగుల హక్కు అని అది భిక్ష కాదని యుటిఎఫ్ జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సుబ్బారెడ్డి అన్నారు. ఈ మేరకు టియుఎఫ్ నాయకులు యుపిఎస్‌ను వ్యతిరేకిస్తూ కదిరి తహశీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం సాయంత్రం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ యుపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ మురళీకృష్ణకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు నరసింహ, సాంబశివ, జగన్, తాజుద్దీన్, ఎస్ఎఫ్ఐ నాయకులు బాబ్జాన్, యుటిఎఫ్ నాయకులు సునీల్ కుమార్, మల్లికార్జున, ఆజం భాష, రవి వర్ధన్ రెడ్డి, మనోహర్, భార్గవ, ఖాజా మొయినాద్దీన్, సంతోష్, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరంలో తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఎస్పీని కలిసిన ధర్మవరం సిఐ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ధర్మవరం వన్‌టౌన్ సిఐగా బాధ్యతలు స్వీకరించిన నాగేంద్రప్రసాద్ జిల్లా ఎస్పీని వి. రత్నను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ధర్మవరం వన్ టౌన్ సిఐ గా నాగేంద్రప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - తనకల్లు

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ ధర్మరాజు సూచించారు. మండల పరిధిలోని కొక్కంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఆశా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి జ్వరం జలుబు గల రోగులను గుర్తించి వారికి తగిన సలహాలు, సూచనలు, అందించాలని చెప్పారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తి శాసనసభ్యురాలు పల్లె సింధూర శనివారం నియోజకవర్గంలోని పలు మండలాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు టిడిపి కార్యాలయం నుంచి శుక్రవారం ఒక ప్రకటన విడుదల విడుదలైంది. ఉదయం నల్లమాడ మండలంలో ఎర్ర వంకపల్లి కాలనీలో పింఛన్లు అందజేయనున్నారు. ఎమ్మెల్యే తో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొననున్నారు. అదే మండలంలో ఆరున్నర గంటలకు వేళ్ళమద్ది ఎస్ టి కాలనీ, 7 గంటలకు రెడ్డిపల్లి ఎస్టీ కాలనీ, 7:30 గంటలకు నల్ల జింగయ్య గారి పల్లి బీసీ కాలనీ, దున్ని కోట, పులగం పల్లి ఎస్సీ కాలనీలలో పింఛన్లు పంపిణీ చేస్తారు. అదే విధంగా ఓడి చెరువు తదితర మండలాల్లో ఎమ్మెల్యే పర్యటించనున్నారు.

తాగునీటి సరఫరా కార్మికులను కనికరించండి



ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో శ్రీ సత్యసాయి, శ్రీరామ్ రెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పనిచేస్తున్న కార్మికులను కనికరించాలని సిపిఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్మికులకు బకాయి వేతనాలు ,పిఎఫ్, ఈఎస్ఐ చెల్లించకుండా ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా ప్రజల దాహార్తిని తీర్చడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన శ్రీ సత్య సాయి ,శ్రీరామ్ రెడ్డి తాగునీటి పథకాలను పటిష్టం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. రోజురోజుకు ఈ పథకాలకు నిధులు కేటాయింపుల్లో కోత విధిస్తున్నారని, కార్మికుల కుదింపు కూడా చోటు చేసుకుంటోందని వాపోయారు. కార్మికులకు నెలల తరబడి వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వాలు జాప్యం చేయడం అన్యాయమన్నారు. గత ప్రభుత్వంలో మూడు నెలలకు ఒకసారి రోడ్లెక్కి వేతనాల కోసం ఆందోళనలను చేయాల్సిన దుస్థితిని ఎదుర్కొన్నామని, ఈ ప్రభుత్వంలోనైనా తాగునీటి పథకాలను పటిష్టంగా అమలు చేసి కార్మికులు తక్షణమే బకాయి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. శాశ్వత ప్రాతిపదిగిన తాగునీటి పథకాలకు నికర బడ్జెట్ కేటాయించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు మండల కన్వీనర్ పైపల్లి గంగాధర్, కో కన్వీనర్ పెడబల్లి బాబా, వాటర్ సప్లై యూనియన్ నాయకులు మధు, రమేష్, సుధాకర్, లక్ష్మి నారాయణ, నాగరాజు, శ్రీనివాస్, నాగేంద్ర, రావిరెడ్డి, చంద్ర, బిల్డింగ్ యూనియన్ నాయకులు రమేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ : తమ సమస్యలు పరిష్కరించాలని సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు మండల కేంద్రంలోని సత్యసాయి పంప్ హౌస్ వద్ద ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 9 రోజుల నుంచి నిరసన కొనసాగిస్తున్నా అధికారుల్లో చలనం రాకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు వెంకటేష్, శంకర, నాగభూషణ, శివశంకర్, రామ్మోహన్ రెడ్డి, షామీర్ ,కేశవ ఓబుల్ రెడ్డి పాల్గొన్నారు.

సమాజ హితానికి మీడియా తోడ్పడాలి



ప్రజాశక్తి వార్షికోత్సవ సంచిక ఆవిష్కరిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, ప్రజాశక్తి సిబ్బంది

ప్రజాశక్తి వార్షికోత్సవ సంచిక ఆవిష్కరణలో జేసీ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

వాస్తవాలు వెలికి తీసి సమాజానికి ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సమాజ హితానికి మీడియా పని చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పేర్కొన్నారు. ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను జాయింట్ కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్లో విడుదల చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రజాశక్తి దిన పత్రిక 44 ఏళ్లుగా నిబద్ధతతో ప్రజల పక్షాన పని చేయడం అభినందనీయం అన్నారు. సమాజానికి ఉపయోగపడే మీడియా చాలా అవసరమన్నారు. పత్రిక మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఎక్కడా రాజీ పడకుండా పత్రిక నడపడం ఎంతో గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, ప్రజాశక్తి పుట్టపర్తి డివిజన్ ఇన్‌ఛార్జి పి. శ్రీనివాసులు, ప్రజాశక్తి సిబ్బంది నాగార్జున, సీనియర్ విలేకరులు బసప్ప, మహేష్, శ్రీరాములు, ఫయాజ్, సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

విధి నిర్వహణలో మృతిచెందిన పోలీసులకు చెందిన కుటుంబాల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని జిల్లా ఎస్పీ రత్న పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు పోలీస్ శాఖలో పనిచేస్తూ వివిధ కారణాల ద్వారా మరణించిన పోలీస్ వారి కుటుంబ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారి యోగక్షేమాలు, కుటుంబ పరిస్థితులు పిల్లల చదువులు, ఆరోగ్య పరిస్థితులపై కుటుంబ సభ్యులతో ముఖాముఖిగా ఎస్పీమాట్లాడారు. ప్రభుత్వం నుండి వారికి ఇంతవరకు వచ్చిన బెనిఫిట్స్ వివరాలు, ఇంకా రావలసిన బెనిఫిట్స్ వివరాల గురించి ఆరా తీశారు. మిగిలిన బెనిఫిట్స్ త్వరగా అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఇటీవలే ఉద్యోగ విరమణ పొందిన 23 మంది సిబ్బందికి ప్రభుత్వం నుండి రావలసిన బెనిఫిట్స్, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు ఎఆర్ డీఎస్పీ విజయ్ కుమార్, ఏవో సుజాత, ఎస్‌పి సి సి రాఘవేంద్ర, అడిషనల్ ఎస్పీ సిసి ఆనంద్, అర్ఐలు వలి చంద్రశేఖర్, సూపరింటెండెంట్లు సరస్వతి, నాగరాజు, సూర్యతేజ, ఆర్ఎస్ఐ ప్రదీప్ సింగ్, ఎఆర్ ఎఎస్ఐలు షౌకత్ అలీ, శ్రీరాములు, డిపిఒ సిబ్బంది, పోలీసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

అలవెన్సులను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

రాత్రి సమయంలో డ్యూటీలకు వెళ్లే ఆర్టీసీ కండక్టర్లు ,డ్రైవర్ల కు ఇస్తున్న అలవెన్సులను పునరుద్ధరించాలని ఎన్‌ఎంయు నాయకులు కోరారు. కండక్టర్, డ్రైవర్లు అలవెన్స్ రద్దు చేయడం పట్ల నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కదిరి డిపోలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన 114 జీవో మేరకు ఆర్టీసీ డ్రైవర్లకు కండక్టర్లకు ఇంతవరకు నైట్‌అవుట్ అలవెన్సులు జూలై-2024 నెలవరకు చెల్లించారన్నారు. అయితే నూతన ప్రభుత్వం ముందస్తు సమాచారం ఇవ్వకుండా, అలవెన్సులను ఆర్టీసీ ఉద్యోగులకు చెల్లించవద్దని ట్రెజరీ అధికారులు ఆదేశాలు ఇవ్వడం భాధకరమని తెలిపారు. అలాగే పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు గ్రాట్యుటీ, ఆర్జితలీవులు, మెడికల్ బిల్లులు ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని విమర్శించారు. సర్వీసులో చనిపోయిన ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వమే మట్టిఖర్చులకు రూ.25వేలు ట్రెజరీ ద్వారా ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఆసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.వి.రమణ, డిపో చైర్మన్ నారాయణ స్వామి, కార్యదర్శి బైరిశెట్టి, రామచంద్ర, బాబ్జి, శ్రీనివాసులు, నారాయణ రెడ్డి, రఫీక్, తిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సత్యసాయి జిల్లాలోని అన్ని ఉపఖజానాల పరిధిలో ఉన్న పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడతామని ఉప ఖజానాధికారి కెఆర్. నాగమల్లిక పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం శ్రీ సత్య సాయి జిల్లా ఉప ఖజాన కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో పెన్షనర్లు తమ సమస్యలను ఆమెకు విన్నవించారు. ఈసందర్భంగా అధికారులు అసోసియేషన్లతో విడతలవారీగా సమావేశాలు నిర్వహించారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పెన్షనర్ సెక్షన్ ఎస్టీవో వైఎస్‌వి ప్రసాద్, జిల్లా పెన్షనర్స్ సంఘం అధ్యక్షులు బి. రామకృష్ణయ్య , జిల్లా కార్యదర్శి ఎంవి. నాగార్జున శెట్టి పాల్గొన్నారు.

పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్‌గా ప్రహ్లాద

పుట్టపర్తి అర్బన్ : పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్‌గా ప్రహల్లాదను ప్రభుత్వం నియమించింది. ఈయన కదిరి మున్సిపాలిటీలో శానిటరీ విభాగంలో పనిచేస్తు ఉద్యోగోన్నతిపై ఇక్కడికి రానున్నారు. ఆయన త్వరలో బాధ్యతలు తీసుకోనున్నారు. ఇక్కడ గతంలో పనిచేసిన అంజయ్య నరసాపురం బదిలీ అయ్యారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

ప్రజాశక్తి - బుక్కపట్నం

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మక్బూల్ హుస్సేన్ తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు మొదటి సంవత్సరం విద్యార్థులకు ఐక్యూ గురించి ఇండక్షన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి కంప్యూటర్ సైన్స్, సిల్క్ డెవలప్మెంట్ గురించి లైబ్రరీ లలో ఉండే సౌకర్యాలను ఉపయోగించుకొని మెలకువలు నేర్చుకోవాలని తెలిపారు. సకాలంలో ఎగ్జామ్స్, ఇంటర్ షిప్ పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూ కోఆర్డినేటర్ రాజ్ మహమ్మద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యాభ్యాసానికి చేయూత

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని టీచర్స్ కాలనీ నివాసం ఉంటున్న నిరుపేదరాలైన శాంతి తన ఇద్దరు పిల్లలకు చదివించడానికి ఆర్థిక ఇబ్బంది పడుతోంది. విషయం తెలుసుకున్న లేపాక్షి దుర్గా పాపనేశ్వర ఆలయ కమిటీ అధ్యక్షులు కరణం రమానందన్ వారికి శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. శాంతి తన ఇద్దరు పిల్లల విద్యాభ్యాసం కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్నేహితుల ద్వారా తెలుసుకున్న రమానందన్ వెంటనే స్పందించి తన వంతుగా పిల్లల పుస్తకాలు, యూనిఫామ్, షూస్ కోసం రూ.15వేలు అందజేశారు.

శాంతియుతంగా వినాయక చవితి ఉత్సవాలు

హిందూపురం : సెప్టెంబర్ 7వ తేదీన వినాయక చవితి, 13న నిమజ్జనం శాంతియుతంగా నిర్వహించు కునేందుకుదకు అందరూ సహకరించాలని డిఎస్‌పి మహేష్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్ఎంఎస్ పంక్షన్ హాల్‌లో పట్టణంలోని వినాయక మంటప నిర్వాహకులు, అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. విగ్రహాలు ఏర్పాటు చేసేవారు నిబంధనలు పాటించాలన్నారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ డీఈ భూపతి, మున్సిపల్ ఏఈ జనార్ధన్ డిప్యూటి తహశీల్దార్ అరతి, సీఐలు రాజగోపాల్ నాయుడు, అబ్దుల్ కరీం, అంజినేయులు, జనార్దన్, అగ్నిమాపక అధికారి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటి ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, తదితరులు

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పిలుపునిచ్చారు. రామగిరి మండలంలోని ఎంజెపి బాలికల పాఠశాలలో శుక్రవారం డ్వామా, అటవీ శాఖల ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించగా పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ ముఖ్య అతిథులుగా హాజరై పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే విద్యార్థుల చేత 'మొక్కలు నాటి పరిరక్షిస్తాం' అని ప్రతిజ్ఞ చేయించారు. వారు మాట్లాడుతూ కరువుకు నిలయమైన ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. మన ప్రాంతంలో అటవీ విస్తీర్ణం చాలా తక్కువగా ఉన్నందునే వర్షాలు సరిగా కురవడం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. చాలామంది మొక్కలు నాటడంతో తమ పని అయిపోయిందని భావిస్తారని కానీ వాటిని సంరక్షించాల్సిన బాధ్యత కూడా తీసుకోవాలన్నారు.

మడకశిర : వన మహోత్సవంలో భాగంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, జపానంద స్వామి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగళి : వన మహోత్సవంలో భాగంగా స్థానిక కెజిబివి, మోడల్ స్కూల్, కెజిఎఫ్ గుప్తా కళాశాలల ఆవరణలో జడ్పిటిసి ఉమేష్, టిడిపి నాయకులు మొక్కలు నాటారు. ఉమేష్ మాట్లాడుతూ బావితరా లకు సమతుల్యతతో కూడిన పర్యావరణాన్ని అందించడానికి ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షిం చాలని తెలిపారు. కార్యక్రమంలో కెజిబివి, మోడల్ స్కూల్, కెజిఎఫ్ గుప్తా కళాశాల సిబ్బంది, టిడిపి మండల కన్వీనర్ కుమారస్వామి, నాయకులు నరసింహప్ప, శివకుమార్, నాగరాజు, శోఖత్ అలీఖాన్, తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : వన మహోత్సవంలో భాగంగా స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, కళాశాల ఆవరణలో హెచ్‌ఎం సుందర్ రాజు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఇఒ నాగరాజు నాయక్ మాట్లాడుతూ మొక్కలు పెంచడం వల్ల వాతావరణ కాలుష్యాన్ని నివారించ వచ్చుని, పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని పరిరక్షించ డం ప్రతి విద్యార్థి బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. అనంతరం ఎంఇఒ, ఉపాధ్యాయులు, విద్యార్థుల మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ షఫీఉల్లా, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే బాలక్రిష్ణ వ్యక్తిగత సహాయకార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. ఈ మేరకు మండల పరిదిలోని టేకులోడు గురుకుల పాఠశాలలో వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ రంగారెడ్డి, జనసేన జిల్లా కార్యదర్శి రమణ, చిన్నా, ప్రవీణ్, టీడీపీ నాయకులు నాగరాజు యాదవ్, బేకరీ గంగాధర్, ప్రిన్సిపాల్ జయసింహానాయుడు పాల్గొన్నారు.

గాండ్లపెంట : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సిద్ధారెడ్డి అన్నారు. వన మహోత్సవాలలో భాగంగాలో శుక్రవారం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్, గంగాధర్, విశ్వనాథరెడ్డి, చిన్నప్పయ్య, రాజారత్నం, పిఇటి పాపారాయుడు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : మానవ మనుగడకు చెట్లు కీలకం అని మండల విద్యాధికారి చెన్నకృష్ణ పేర్కొన్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని వీవర్స్ కాలని మున్సిపల్ హైస్కూల్ నందు చెట్లు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఓబులరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ కబ్జాపై బాధితుల ఫిర్యాదు

ప్రజాశక్తి - తనకల్లు

తమకు చెందిన భూమిని కబ్జా చేశారంటూ బాధితులు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా బాధితుడు కిష్టప్ప మాట్లాడుతూ మండల పరిధిలోని మల్‌రెడ్డిపల్లి గ్రామం గుర్రంబైలులో తన తల్లి, అన్నకు చెందిన భూమిని విఆర్‌ఎ వెంకటప్ప ఆక్రమించుకున్నాని ఆరోపించారు. ఈ విషయంపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

గొర్రెల కాపరి ఆత్మహత్య కారకులను శిక్షించండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండల పరిధిలోని లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి కురుబ శ్రీరాములు (40) ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మృతుని భార్య భారతి, కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. శ్రీరాములు ఆత్మహత్యకు కారకులైన వారిని తక్షణమే అరెస్టు చేసి వారిని శిక్షించాలన్నారు ఈ విషయంపై ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని సిఐని నిలదీశారు. తమకు న్యాయం జరిగేంతవరకు ఇక్కడ నుండి కదిలేది లేదన్నారు. శ్రీరాములు గురువారం రాత్రి తన ఇంటిలోనే భయభ్రాంతులకు గురై ఆత్మహత్య చేసుకున్నాడరన్నారు. శ్రీరాములపై నింద వేసి భయభ్రాంతులకు గురి చేశారని ఆరోపించారు. జరిగిన సంఘటనపై నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపించి న్యాయం చేయాలని వారు కోరారు.

నిందితులను శిక్షించాలి : సిఐటియు

కొత్తచెరువు మండల పరిధిలోని లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి శ్రీరాములు ఆత్మహత్యకు కారకులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. గ్రామంలో ఇలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ నిర్వహించాలన్నారు స్వీపర్ పై ఆయన అత్యాచారయత్నానికి పాల్పడ్డారని కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు ఎలాంటి విచారణ నిర్వహించకుండా ఆయన పైన దాడికి పాల్పడ్డారన్నారు. దీంతో ఆయన భయభ్రాంతులకు గురై ఇంటిలోనే ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. పోలీసులు గ్రామంలోకి వెళ్లి విచారణ నిర్వహించి కారుకులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

ఎఎస్పీగా ఆర్ల శ్రీనివాసులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా అదనపు ఎస్పీగా ఆర్ల శ్రీనివాసులును నియమిస్తూ రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారుల నుండి ఉత్తర్వులు అందాయి. పెనుగొండ డీఎస్పీగా విధులు నిర్వహిస్తూ ఉన్న శ్రీనివాస్‌ను ఎఎస్పీగా కూటమి ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించింది. ఈ మేరకు ఆయన త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు.

పల్లె ఉమకు నివాళి

కొత్తచెరువు : కొత్త చెరువులోనే ధర్మవరం రోడ్డులో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సతీమణి పల్లె ఉమా, ఆరవ వర్ధంతిని టిడిపి నాయకులు శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, మాజీ జడ్పిటిసి లక్ష్మీనారాయణ, టిడిపి నాయకులు రఘుపతి, సూర్య ప్రకాష్, సుబ్రహ్మణ్యం, మాధవి, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి సతీమణి పల్లె ఉమా వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం స్థానిక అంగన్వాడీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల కేంద్రానికి చెందిన మారుతి ప్రసాద్ ఆధ్వర్యంలో బ్రెడ్లు, పాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మలిరెడ్డి, నాయకులు మాజీ సర్పంచ్ సాకే యశోద, సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ బాలు, వెంకట రాముడు, దాసరి శ్రీనివాసులు, సయ్యద్ బాషా, లావణ్య గౌడ్, మంజు, సుధీర్, రమణా రాయల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : స్థానిక సప్తగిరి ఎంబిఎ కళాశాల ఆవరణంలో ఆ కళాశాల ప్రిన్సిపల్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పల్లె ఉమ వర్ధంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కొడిగేపల్లిలోని అందుల పాఠశాలలో విద్యార్థులకు పాలు బ్రెడ్డు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, వాలంటీర్లు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సతీమణి పల్లె ఉమ వర్ధంతిని శుక్రవారం పుట్టపర్తిలో నిర్వహించారు. పుట్టపర్తిలోని పలు చోట్ల పేదలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. సేవా కార్యక్రమాలు చేపట్టిన రామ్ లక్ష్మణ్‌లను పల్లె రఘునాథరెడ్డి అభినందించారు. అనంతపురంలో జరిగిన పల్లె ఉమా వర్ధంతి సభకు పుట్టపర్తి కి చెందిన రామ్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కాన్వాయ్ ఏర్పాటు చేశారు. సుమారు 70 వాహనాల్లో వర్ధంతి కి వందలాది మంది అభిమానులు, టీడీపీ కార్యకర్తలు తరలివెళ్లారు.

పెనుకొండ : పల్లె ఉమ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని శ్రీసత్యసాయి డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ప్రిన్సిపళ్లు డాక్టర్ అదిశేషారెడ్డి, గంగాధర్ ఆధ్వర్యంలో పల్లె ఉమ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. డాక్టర్ అదిశేషారెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలు స్థాపించి విద్యాదానం చేసిన మహోన్నత వ్యక్తి పల్లె ఉమ అని కొనియాడారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్డు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ కేశవయ్య, ఆయా కళాశాలల అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిటాల రవీంద్ర జయంతి

బత్తలపల్లి : మాజీ మంత్రి పరిటాల రవి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. టిడిపి స్థానిక కార్యాలయంలో పరిటాల రవీంద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు .అనంతరం భారీ వాహనాలలో వెంకటాపురం తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల నాయకుడు తాళ్లూరి సతీష్, బోయపాటి అప్ప స్వామి, నెట్టెం అశోక్, తెలుగు యువత ఇర్షాద్, ధర్మవరం చిన్న, మాల్యవంతం బాబు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మాజీ మంత్రి పరిటాల రవీంద్ర జయంతిని మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా పరిటాల రవీంద్ర చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బాలికల,బాలుర ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థులకు లడ్డు, మిక్సర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రమేష్ బాబు, కరణం ప్రభాకర్ నాయుడు, తుమ్మల మనోహర్, తుమ్మల సూరి, అబ్దుల్లా, రంగనాయకులు, చంద్ర సేన తదితరులు పాల్గొన్నారు.

సప్తగిరి కళాశాలలో సినిమా షూటింగ్

హిందూపురం : పట్టణంలోని సప్తగిరి డిగ్రీ కళాశాలలో శుక్రవారం సినిమా షూటింగ్ ప్రారంభం అయింది. స్వన్ను మైండ్స్ సమర్పణలో శ్రీ వాయు నందన స్టూడియోస్ పతాకంపై ప్రొడక్షన్ నెంబర్ వన్ పేరుతో హిందూపురం పట్టణానికి చెందిన చన్ను కథ, కథనం, స్క్రీన్, ప్లే,తో పాటు దర్శకత్వం, హీరో, నిర్మాతగా చేస్తున్న నూతన సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాన్ని సప్తగిరి కళాశాలలో ఘనంగానిర్వహించారు. ఈ సందర్భంగా హీరో చన్ను మాట్లాడుతూ తనకు జీవిత పాఠాలను నేర్పిన కళాశాలలో తన చిత్రాన్ని చిత్రీకరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తెలుగు, కన్నడ, తమిళం మూడు భాషలలో ఈ సినిమా బిగ్ స్క్రీన్ పై రిలీజ్ అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ రాజగోపాల్ నాయుడు, కళాశాల ప్రిన్సిపల్ నారాయణరెడ్డి, హీరోయిన్ ప్రతిభ గోవిందరాజ్, కళాకారులు అఖిల, వైష్ణవి, దుర్గ, కేశవ్, లల్లీ, మేనేజర్ అరవింద్, వాఖ్యాత శశికళ, టెక్నీషియన్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ కళాశాలల కార్యవర్గాల ఎన్నిక

హిందూపురం : భారత విద్యార్థి సమాఖ్య (ఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ కళాశాలల కార్యవర్గాలను శుక్రవారం ఎన్నుకున్నారు. ఈసందర్భంగా బాలయేసు, సప్తగిరి కళాశాలల నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విలేకరులకు ప్రెస్ స్టిక్కర్లు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం సబ్ డివిజన్ వ్యాప్తంగా వివిధ పత్రికలు, ఎలాక్ట్రానిక్ మీడియాలో పని చేస్తున్న పాత్రియులకు పోలీస్ శాఖ తరపున స్టిక్కర్లు ఇవ్వడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి మహేష్ అన్నారు. ప్రెస్ క్లబ్ కమిటీ ఆహ్వానం మేరకు ఆయన శుక్రవారం పురం ప్రెస్‌క్లబ్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన చేతుల మీదుగా ప్రెస్ క్లబ్ ఆవరణంలో మహాగని చెట్టును నాటించారు. అనంతరం ప్రెస్ క్లబ్‌లో డిఎస్‌పిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రామాంజినేయులు, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ కుమార్, సీనియర్ రిపోర్టర్ షబ్బీర్, పర్యావరణ వేత్త భాస్కర్ రెడ్డి, ప్రెస్ క్లబ్ కమిటీ నాయకులు అల్లీపిరా, చెన్నకేశవ రెడ్డి, సాయి చరణ్, ప్రదీప్, గోపాల్, జబివుల్లాతో పాటు పాత్రికేయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి

తెలుగు దినపత్రిక

ప్రత్యేక అనుబంధం

గుత్తి-గుంతకల్లు

అనంతపురం జిల్లా

8 పేజీలు | శనివారం | 31-08-2024



ఖనిజసంపదల నిలయం 'అనంత' ..!

7వ పేజీ

ఆర్తులకు అండ.. పేదలకు చేయూత...

సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కె.మధుసూధన్ రెడ్డి



బాలుడి వైద్యఖర్చుల కోసం బాధితులకు ఆర్థికసాయం అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి



మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి - గుత్తి

గుత్తి పట్టణం లోని అనంతపురం రోడ్డులో నివాసం ఉండే మణికంఠ మెటల్ స్టోన్ క్రషర్స్ అధినేత , వైసిపి జిల్లా నాయకులు కె. మధుసూధన్ రెడ్డి ఎవరికి ఏ అవసరం వచ్చిన స్పందిస్తారు. తనకి తోచిన సాయం అందిస్తుంటారు. సామాజిక కార్యక్రమాల్లో ప్రజల మన్నన చూరగొంటున్నారు. సేవే లక్ష్యంగా ఆయన అనేక కార్యక్రమాలతొ ముందుకు సాగుతున్నారు. ప్రజల కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటున్నారు. అనేక మంది పేదలను ఆదుకుంటున్నారు.గుత్తి పట్టణంలోని బీసీ కాలనీలో స్వంత నిధులతో వినాయక ఆలయాన్ని నిర్మించారు. అలాగే మండలంలోని కరడికొండ గ్రామం వద్ద కొండ పైన నరసింహ స్వామి ఆలయాన్ని స్వంత నిధులతో నిర్మిస్తున్నారు. క్రీడా కారులకు ప్రోత్సాహం అందిస్తున్నారు. క్రీడల నిర్వాహణకు ఆర్థిక సాయం చేస్తున్నారు. గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు స్వంతంగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. ఆలయాల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తున్నారు. పేదల వివాహాలకు సాయం చేస్తున్నారు. దేవాలయాల నిర్మాణాలకు ఆర్థిక సాయంతో పాటు కంకర (మెటిరియల్) కూడా ఇస్తున్నారు. వ్యాధిగ్రస్తులకు వైద్య ఖర్చుల నిమిత్తం సాయం చేస్తు అండగా నిలుస్తున్నారు. ప్రమాదాల్లో గాయపడ్డ వారికి చేయుతనిస్తున్నారు. వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతూ తన దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. పట్టణంలోని చెర్లోపల్లి కాలనీకి చెందిన భవన నిర్మాణ కార్మికుడు క్యాన్సర్‌కు గురి కావడంతో వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే కిడ్నీ వ్యాధిగ్రస్తులకు కూడా ఆర్థిక సాయంచేశారు. ప్రమాదాలు , వివిధ కారణలతో చనిపోయిన పేద కుటుంబాలకు ఆర్థింకంగా ఆదుకొని అండగా నిలిచారు. రాతిదూలం పోటీల నిర్వాహణకు తన వంతు సాయం చేశారు. గుంతకల్లు మండలంలోని నాగ సముద్రం, పామిడి మండలంలోని రామరాజుపల్లి , పెద్దవడుగూరు, తొండపాడు గ్రామాలలో జరిగిన రాతి దూలం లాగుడు పోటీలలోని విజేతలకు తన వంతుగా బహుమతి సొమ్మును ఇచ్చారు. వన్నేదొడ్డిలోని శివాలయం , నరసింహస్వామి ఆలయాల నిర్మాణం కోసం రూ.లక్ష విరాళం ఇచ్చారు. గుత్తి పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీకృష్ణుని దేవాలయం, గార్లదిన్నె లోని అయ్యప్ప స్వామి దేవాలయం , పెద్దవడుగూరులోని శిరిడి సాయి ఆలయం, కొజ్జేపల్లి , ఉబిచెర్ల , బేతాపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆలయాల నిర్మాణం కోసం కావలసిన లక్షలాది రూపాయల విలువ చేసే మెటిరియల్ (కంకర) ను ఉచితంగా సరఫరా చేస్తున్నారు. వినాయక చవితి సందర్భంగా ఉత్సవ విగ్రహాలను పలు ప్రాంతాలకు చెందిన వారికి ఉచితంగా అందజేస్తున్నారు. ముస్లీం పవిత్ర మాసం అయిన రంజాన్ నెలలోఇఫ్తార్ విందును ఇచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రికి ప్రతి శుక్రవారం వైద్య పరీక్షలకు వచ్చే గర్భిణులకు మధ్యాహ్న భోజనాన్ని ఉచితంగా అందిస్తున్నారు. 2018-19 సంవత్సరం నుంచి కె. మధుసుదన్ రెడ్డి ఆధ్వర్యంలో గర్భిణులకు భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. రెండు ఏళ్ల క్రితం ఎంఎస్ జూనియర్ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆ రక్త దాన శిబిరంలో దాదాపు 140 బ్యాగులు రక్తాన్ని సేకరించి ఆర్‌డిటికి అందజేసి ఆ సంస్థ నిర్వాహకులతో మన్ననలు పొందారు. పట్టణంలోని క్రీడా మైదానాల్లో స్వంతంగా ఆయన క్రికెట్ టోర్నీలను నిర్వహించారు. ఫుట్ బాల్ క్రీడాకారులకు క్రీడా సామాగ్రిని ఉచితంగా అందజేశారు. పట్టణ శివారులో ఉన్న జడ్‌వీరా రెడ్డి (సిపిఎం) కాలనీ చుట్టు ముళ్లపొదలు , పిచ్చిమొక్కలు ఉండటంతో తన సొంత సొమ్ము వెచ్చించి జేసీబీ ద్వారా శుభ్రం చేయించారు. గత ఏడాది సత్యసాయి కార్మికులు వేతనాల కోసం సమ్మె చేస్తున్న సమయంలో నీటి సమస్య తలెత్తడంతో తన స్వంత ఖర్చులతో తాగునీటిని ట్యాంకర్ల ద్వారా మున్సిపాలిటీ సంపులకు తరలించారు. గత నెలలో పట్టణంలోని ఇరువురు క్యాన్సర్ బాధితులకు రూ. 10 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఇలా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తు ఆయన ఆదర్శంగా నిలుస్తున్నారు.



ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు భోజన సౌకర్యం కల్పిస్తున్న మధుసూదన్‌రెడ్డి

మహిళల రక్షణకు ప్రాణాలొడ్డి అమరుడైన హంపన్న



గుత్తిలో ఉన్న హంపన్న సమాధి



గూలెపాళెం హంపన్న

ప్రజాశక్తి - గుత్తి

బ్రిటిష్ సిపాయిల కామ దాహానికి బలైపోతున్న మహిళల శీలాన్ని కాపాడేందుకు ఎదురునిలిచి సిపాయిల తుపాకి గుళ్ల కు ప్రాణాలు వదిలి గూళపాళెం హంపన్న అమరుడయ్యారు. వీర హంపన్న ప్రాణత్యాగానికి ప్రతీకగా బ్రిటీష్ ప్రభుత్వం గుత్తి పట్టణంలో సర్ థామస్ మన్రో సత్రం ఎదురుగా హంపన్న సమాధితో పాటు ఒక స్మారక స్తూపాన్ని నిర్మించింది. 1893వ సంవత్సరం అక్టోబర్ 4 న బ్రిటీష్ సిపాయిల దండు ఒకటి బళ్లారి నుండి సికింద్రాబాదుకి వెళుతూ గుంతకల్లులో విడది చేసింది. ప్రస్తుతం ఎంతో పెద్ద పట్టణం గా పేరు పొందిన గుంతకల్లు ఆనాడు చిన్న కుగ్రామం. ఆరోజుల్లో మిలిటరీ దండు విడిది చేసిందంటే మహిళలు ఇల్లు ఒదిలి బయటికి వెళ్లేందుకు సాహసించేవారు కారు. ప్రాణ భీతితో భయ కంపితులయ్యేవారు. గుంతకల్లులో విడిది చేసిన సైన్యంలోని ఇద్దరు సిపాయిలు సాయంత్రం గ్రామ శివారులో షికారుకు వెళుతూ జొన్న చేనులో గడ్డి కోసుకుంటున్న ఇద్దరు మహిళలను చూశారు. ఆ ఇద్దరిని శారీరకంగా అనభవించాలనే దుర్బిద్ధి సిపాయిలలో పుట్టింది. సిపాయిలు తమ వద్దకు రావడాన్ని గమనించిన మహిళలు తమ మానాన్ని రక్షించుకోవాలనే తపనతో అక్కడి నుంచి పరుగు తీశారు. అయితే సిపాయిలు మాత్రం వారిని వదలక వెంబడిస్తున్నారు. అదే సమయంలో రైల్వే గేట్‌కీపర్‌గా ఉన్న గూళపాళెం హంపన్న ఆర్థనాదాలతొ పరిగెడుతున్న మహిళలను చూశాడు. గూళపాళెం హంపన్న వెంటనే వారివద్దకు వెళ్లి తన గదిలోకి వెళ్లమని చెప్పాడు. అనంతరం హంపన్న సిపాయిలకు అడ్డుగా నిలిచాడు. అడ్డు తొగలమని సిపాయిలు హంపన్నకు అర్థం కాని భాషలో ఆదేశించినా, హెచ్చరించినా ఆయన బెదరలేదు. తన మాతృదేశపు మహిళల మానాన్ని కాపాడుకునేందుకు ప్రాణాలు సైతం పణంగా పెట్టాడు. దీంతో ఆంగ్లేయులైన సిపాయిలు ఆగ్రహించి హంపన్నను తుపాకితో కాల్చి నేల కూల్చారు. తుపాకి పేలుడు శబ్దం విన్న రైల్వే పోలీసులు అక్కడికి పరుగులు తీశారు. దీంతో సిపాయిలు పారిపోయారు. తుపాకి గుళ్లకు నేలకొరిగిన హంపన్నను బతికించాలని వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చినా ఫలితం లేకపోయింది. హంపన్న ప్రాణాలు అప్పటికే అనంత వాయువుల్లో కలిసిపోయాయి. హంపన్న తమ దేశ మహిళల మాన ప్రాణాలు కాపాడేందుకు ప్రాణాలు పోగొట్టుకున్నాడు. ఈ అమరవీరుడికి గుర్తుగా గుత్తి లోనే ఒక స్థూపం నిర్మించారు. ఆ స్థూపం దిగువ భాగాన 'యూరోపియన్ సిపాయిల బారినుంచి ఇద్దరు మహిళలను రక్షించబోయి సిపాయిల తుపాకీ గుళ్లకు బలైన హంపన్న పార్థివదేహం ఇక్కడ పాతి ఉంది. ఇతను మరణించి యూరోపియన్ , హిందూ దేశస్తుల మెప్పు పొందాడు' అని ఆంగ్ల భాషలో రాసి ఉంది. బ్రిటీష్ పాలకులు గుత్తి దుర్గాన్ని సందర్శించినప్పుడల్లా హంపన్న స్మారక స్థూపానికి ఘనంగా రాజ లాంఛనాలతో నివాళులు అర్పించేవారు.

అయితే నేటి పాలకులు అధికారులు నివాళులే కాదు నిలిచి చూసిన పాపాన పోలేదు. 30 ఏళ్ళ క్రితం ప్రాథమిక స్థాయి విద్యార్థులకు హంపన్న వీరగాథ పాఠ్యాంశంగా ఉండేది. కొన్ని సంవత్సరాల క్రితం ఆ పాఠ్యాంశాన్ని ప్రభుత్వం తొలగించడం శోచనీయం. గతంలో ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న గోరంట్ల మాధవ్ ఆక్రమణల నడుమ ఉన్న స్థూపాన్ని గుర్తించారు. స్థానికులతొ కలిసి ఆక్రమణలు తొలగించి ప్రహరీని నిర్మించి సుందరంగా తీర్చిదిద్దారు. భావితరాలు హంపన్న త్యాగాన్ని, స్థూపం విషిష్టతను గురించి తెలుసుకునేందుకు స్మారక స్తూపాన్ని దర్శించాలి.


బురుజు

చరిత్రకు సాక్ష్యం గుత్తికోట


గుత్తి కొండ

నేటికీ చెక్కు చెదరని కట్టడాలు


సజీవ సాక్ష్యాలుగా అలనాటి చిత్రాలు

ప్రభుత్వాలు స్పందిస్తే మరింత ప్రాచుర్యంలోకి..

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి కోటకు ఉన్న చరిత్ర, ప్రాధాన్యత ఈనాటిది కాదు. రతనాలసీమగా పిలవబడే రాయలసీమలో గుత్తిలోని కోట కట్టడాలు పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందాయి.


కర్నూలు, అనంతపురం జిల్లాల సరిహద్దులో గుత్తి పట్టణానికి తూర్పు దిశలో 300 వందల మీటర్ల ఎత్తున కొండలపై నిర్మించిన గుత్తి కోట శతాబ్దాల చరిత్రకు ప్రతీకగా విరాజిల్లుతోంది. ఆంధ్రుల పరాక్రమ వైభవనానికి భవన కళాశిల్పాలు సాక్షిగా నిలుస్తున్నాయి. మూడువైపులా భారీ విస్తీర్ణంలో కోటను నిర్మించారు. ప్రారంభంలో పెద్ద కందకం బావి ఉన్నట్లు సాక్షంగా కోట ప్రారంభం అవుతుంది. దీన్ని దాటిన తర్వాత సింహద్వారం, నగరేశ్వర ఆలయం ఉంటాయి. రెండవ దారి దాటి పైకి వెళ్లగానే సైనికుల కవాతును తెల్పే విశాలమైన మైదానం ఉంది. అక్కడ గజ, అశ్వశాలలు ఉన్నాయి. గుర్రాలు, ఎనుగులు నీరు తాగేందుకు ఏర్పాటు చేసిన పెద్దబావి ఉంది. మరికొన్ని దారులు దాటితే రాజులు ఉండడానికి నివాస గృహాలు ఉన్నట్లు ఆనవాళ్లు కనిపిస్తాయి. కోటలో హిందూ రాజులు నాట్యశ్యాలకుగాను, మహ్మదీయ రాజులు మసీద్‌లుగా ఉపయోగించే రంగ మంతపం ఉంది. వాటిల్లో ఉన్న వన్నెచిత్రాలు నేటికీ వన్నె తగ్గలేదు. రంగమంతపం దాటగానే రాజకీయ సౌందర్యాన్ని పుచ్చుకున్న ఓ మండపం ఉంది. దీన్ని బేగం మహల్, బోగం మహల్ అంటారు. దాని సమీపంలో మురారీరావ్ గోర్పడే సభా భవనాలు ఉన్నాయి. ఇవి దాటగా ఖిల్లా ఉంది. అక్కడి నుంచి ఏ వైపు చూసినా 50 కిలోమీటర్ల విస్తీర్ణం కనిపిస్తుంది. కోటలో ఖైదీలను ఉంచేందుకు కారాగారం, ధనాగారాలూ ఉన్నాయి.


గుత్తికోట ద్వారం

పద్ధతి ప్రకారం శత్రుదుర్భేద్యంగా కోట నిర్మాణాలు ఉంటాయి. కోటలో 101 బావులు ఉన్నాయి. దుర్గం నిర్మాణ అద్భుతాలను చూసిన విల్స్ అనే చరిత్ర కారుడు క్షామం, మోసం ఇవి రెండూ మాత్రమే దుర్గాన్ని లొంగదీయగలవని తన పుస్తకంలో పేర్కొన్నారు. కోటలోని శాసనాలు సంస్కృతం, కన్నడ భాషలో ఉన్నాయి. విజయనగర చక్రవర్తి బుక్కరాయలు శాసనంలో గుత్తికోట దుర్గం రాజ్యంగా కీర్తింపబడింది.




గుత్తికోటలో చెక్కు చెదరని కట్టడం


అలనాటి చిత్రాలు

చరిత్ర ఇలా...

గుత్తి కోటకు చరిత్ర ఘనంగానే ఉంది. ఇక్కడ తొలి శాసనాలు కన్నడం, సంస్కృతంలో ఉన్నాయి. అవి 7వ శతాబ్ధం నాటివని అంచనా. ఒక శాసనంలో ఈ కోట పేరు గధగా ఇవ్వబడింది. విజయనగర చక్రవర్తి బుక్కరాయల శాసనంలో గుత్తి కోట దుర్గరాజముగా కీర్తించబడిందని శాసనాలు చెబుతున్నాయి. క్రీస్తు పూర్వం 2005 నుంచి 900 వరకు గుత్తి దుర్గంలో జన నివాసాలు ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయి. రాతియుగం అవశేషాలు కొన్ని తవ్వకాల్లో బయటపడ్డాయి. అలనాటి మనుషులు నివాసం ఉన్న గుహలను బ్రిన్‌పూల్ అనే బ్రిటిష్ వ్యక్తి బహిరంగ పరిచాడు. అనాటి పనిముట్లు, శిథిలాలు ఉరవకొండ మండలంలోని లత్తవరం, విడపనకల్లు మండలంలోని కరకముక్కల ప్రాంతాల్లో కూడా బయటపడ్డాయి. క్రీపూ 260 నుంచి మాత్రం దీని విశేషాలు క్రమపద్ధతిలో వెలుగులోకి వచ్చాయి.

ఈ ప్రాంతాన్ని క్రీపూ 220 నుంచి 200 వరకూ శాతవాహనులు పాలించినట్లు తెలుస్తోంది. అనంతరం బాదామి చాళుక్యులు, రాష్ట్రకూటులు, పశ్చిమ గంగమ రాజులు, పశ్చిమ చాళుక్యులు పాలించారు. కాగా కోట గోడను 11, 12వ శతాబ్ధంలో చాళుక్యులు నిర్మించినట్లు తెలుస్తోంది. కోటలో కనిపించే సంస్కృత శ్లోకాన్ని బట్టి హరిహర బుక్కరాయలు గుత్తిని రాజధానిగా చేసుకుని పాలించినట్లు తెలుస్తోంది. బుక్కరాయల కాలంలోనే కోటకీర్తని సంతరించుకుందని తెలుస్తోంది. విజయనగర రాజుల హయాంలో కోట గొప్ప వెలుగు పొందింది. నరసింహరాయులు హయాం నుంచి వారి స్వాధీనంలో ఉన్నట్లు తెలుస్తోంది.


రంగమండపం

విజయనగర పాలకుల చిహ్నమైన గజలక్ష్మి చిత్రం అన్నిద్వారాలపై ప్రముఖంగా కనిపిస్తుంది. రాయల మరణానంతరం వారసత్వ తగాదాల వివాదంలో గుత్తి కోటకు చాలా ప్రాముఖ్యత ఏర్పడింది. అప్పాజీగా ప్రసిద్ధుడైన తిమ్మరుసు తనబాల్యాన్ని గుత్తిలో గడిపినట్లు ఆధారాలు ఉన్నాయి. విజయనగర రాజుల వివాదంలో సామ్రాజ్యానికి వారసులైన సదాశివరాయలను మంత్రి శలకం తిమ్మయ్య కుట్రచేసి ఈ కోటలోనే బంధించగా, తర్వాత రామరాయలు గుత్తిపై దండెత్తి సదాశివరాయులను విడిపించినట్లు శాసనాలు చెబుతున్నాయి.

విజయనగర సామ్రాజ్య పతనానంతరం బీజాపూర్ నవాబులు పాలించారు. క్రీపూ1650 ప్రాంతంలో నల్గొండ నవాబులు కుతుబ్ షాహి అధికారులైన మీర్ జుంబ్లా అనేక నెలలు ముట్టడి తర్వాత కోటను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఔరంగజేబు దాడుల్లో గుత్తి మొగలాయిల వశమైంది. క్రీపూ1750 ప్రాంతంలో మరాఠీరాజు గుత్తిని స్వాధీనం చేసుకున్నాడు. క్రీశ 1762లో హైదర్ అలీ గుత్తిపై దండెత్తి ఆరు నెలలు ముట్టడి సాగించినా గెలుపొందలేక వెనుదిరిగి మరో దండయాత్రలో స్వాధీనం చేసుకొన్నాడు.


ప్రభుత్వాలు స్పందిస్తే మరింత ప్రాచుర్యంలోకి..

ఇంతటి ఘన చరిత్ర ఉన్న గుత్తి కోట పరిరక్షణలో ప్రభుత్వాల నిర్లక్ష్యం ఉందనే చెప్పాలి. భావి తరాలకు చరిత్రను అందించాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. అందులోనూ గుత్తికోట లాంటి చరిత్ర కలగిన కోటను నేటి విద్యార్ధులకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గుత్తి కోట పరిరక్షణకు ఇప్పటి వరకూ ప్రభుత్వాలు తీసుకున్న చర్యలు నామమాత్రమే అని చెప్పాలి. ఇక్కడి స్థానికులు, గుత్తికోట పరిరక్షణ కమిటీ నాయకులు మాత్రం సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తున్నారు. అయినా అక్కడి నుంచి పెద్దగా స్పందన రావడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప గుత్తికోట పరిరక్షణకు పూర్తిస్థాయిలో చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. చరిత్ర వైభవాన్ని తెలిపే గుత్తికోటను భవిష్యత్తు తరాలకు అందించే బాధ్యతను ప్రభుత్వాలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


గుత్తి ఖిల్లా


బావి


ఏనుగుల శాల


చెక్కు చెదరని చిత్రాలు



అత్యుత్తమ విద్యాప్రమాణాల నిలయం గేట్స్



◆ పేద విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్య అందించడమే లక్ష్యం
◆ బిల్ గేట్స్ స్ఫూర్తితో ఇన్స్టిట్యూట్ స్థాపన
◆ నాక్‌తో అత్యుత్తమ శ్రేణి సాధించిన ఏకైక సంస్థ
◆ సౌత్ ఇండియాలోనే తొలిసారిగా సౌర విద్యుత్తుతో నడుస్తోన్న కళాశాల
◆ అటానమస్, ఎన్‌బిఎ అక్రిడేషన్, నాక్ ఏ గ్రేడ్ సదుపాయం

ప్రజాశక్తి - గుత్తి

వర్షాభావం నేపథ్యంలో నిత్యం కరువుతో సతమతం అవుతున్న అనంతపురం జిల్లాలో విద్యార్థుల చదువు కొనసాగాలంటే ఎంతో వ్యయ ప్రయాసాలతో కూడుకున్న అంశం. పేద విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్య ఆర్థిక భారంగా ఉంది. ఈ తరుణంలో విద్యార్థులను ఆదుకునేందుకు ముందుకొచ్చారు ఎన్ఆర్ఐ గజ్జల రఘునాథ రెడ్డి. విద్యార్థులకు ఉత్తమ విద్యా ప్రమాణాలతో ఇంజినీరింగ్ విద్య అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. తక్కువ ఫీజులతో విద్యను భోదించేందుకు ఇంజినీరింగ్ కళాశాలను స్థాపించారు. విద్యార్థుల కోసం అనేక సౌకర్యాలు కల్పించి స్కిల్స్ డెవలెప్‌మెంట్‌కు పాటుపడ్డారు. కళాశాలలో చదివిన విద్యార్థులు అధిక శాతం స్వదేశం, విదేశాల్లో మల్టినేషనల్ కంపెనీల్లో ఉన్నత ఉద్యోగాలు చేస్తూ స్థిర పడ్డారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేస్తూ గుత్తి గేట్స్ ఇన్సిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఇంజినీరింగ్ విద్యలో కలికితురాయిగా నిలుస్తూ ముందుకు సాగుతోంది.

కడప జిల్లా జమ్మల మడుగు మండలం పాల్తూరు గ్రామానికి చెందిన గజ్జల రామిరెడ్డి కుమారుడు గజ్జల రఘునాథ రెడ్డి అనంతపురం జిల్లా గుత్తి పట్టణ శివారులోని 44వ జాతీయ రహదారి పక్కన 25.5 ఎకరాల విస్తీర్ణంలో 2001 మార్చి నెలలో గేట్స్ ఇన్సిట్యూట్ ఆఫ్ టెక్నాలజి (గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల)ను నిర్మించారు. జెఎన్‌టియు అనుబంధంగా ఆ విద్యా సంస్థ ఏర్పాటైంది. రఘునాథ రెడ్డి మామ వికె.సుధీర్ రెడ్డి కరస్పాండెంట్‌గా ఆ కళాశాలను ప్రారంభించారు. ఈసిఈ, సిఎస్‌సి, ఐటి కోర్సుల్లో 120 మంది విద్యార్థులతో ప్రారంభమైన కళాశాల ప్రస్తుతం దాదాపు 3000 మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో విద్యను అభ్యసిస్తున్నారు. ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్‌లతో పాటు ఎమ్‌టెక్ , ఎంబీఏ కోర్సుల్లో విద్యార్థులు చదువుతున్నారు. ఆహ్లాదకరమైన కళాశాలలో విశాలవంతమైన బోధన తరగతి గదులు ఉన్నాయి. ప్రతి తరగతి గదికి ప్రొజెక్టర్‌ను ఏర్పాటు చేశారు. అత్యాధునిక ప్రయోగశాల ఉంది. 8జిబి ర్యామ్‌తో కలిగిన కంప్యూటర్లు ఉన్నాయి. విద్యార్థులకు తగినంత మంది ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొపెసర్లు, బోధనేతర సిబ్బంది ఉన్నారు. కళాశాల ఆవరణలో విశాలమైన క్రీడా మైదానం ఏర్పాటు చేశారు. విద్యార్థుల రాకపోకల కోసం 24 బస్సులను ఏర్పాటు చేశారు. విద్యార్థినీ, విద్యార్థులకు వేరువేరు వసతి గృహాలను అందు బాటులో ఉంచారు.

దక్షిన భారత దేశంలోనే మొదటి సారిగా సొలార్ విద్యుత్‌తో కళాశాల నడుస్తోంది. విద్యార్థుల్లో సామాజిక సేవ నింపెందుకు విద్యార్థులతో ఎన్ఎస్ఎస్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ కాంపిటీషన్‌ను తరచు ఏర్పాటు చేస్తుంటారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం అటానమస్, ఎన్‌బిఎ అక్రిడేషన్, నాక్ ఏ గ్రేడ్ ఈ కళాశాల ప్రత్యేకత. ఎంఒయు బిఎస్ఎన్ఎల్, ఇన్ఫోసిస్ ట్రైనింగ్ పార్టనర్‌గా ఉన్నాయి. అటల్ ఇంక్‌బేషన్, ఏపీ స్కిల్డ్ డెవల ప్‌మెంట్ సెంటర్‌తో యాజమా న్యం ఒప్పందం కుదుర్చుకుంది.



నాక్‌తో అత్యుత్తమ శ్రేణి సాధించిన ఏకైక సంస్థగా విద్యార్థులు అబివృద్ధి చెందడానికి ఎన్నో కార్యక్రమాలు నిర్వహిసున్నారు. చెన్నైకి చెందిన ప్రముఖ డ్రోన్ల తయారీ సంస్థ ఎరోస్పేస్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల ఒప్పందాల ద్వారా విద్యార్థులకు విద్యానైపుణ్యంలో శిక్షణ ఇస్తున్నారు. ప్రతి ఏడాది 10 మంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందిస్తున్నారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో భవిష్యత్తులో విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు కల్పించుకునేందుకు కళాశాల యజమాన్యం దోహదపడుతోంది. కళాశాల యాజమాన్యం ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. విద్యాభ్యాసం పూర్తి చేసిన పలువురు గేట్స్ విద్యార్థులు అమెరికా, జర్మనీ, దుబాయి, ఇండియా లోని బెంగళూరు, హైదరాబాదు, చెన్నై, పూనే , నాగపూర్ తదితర ప్రాంతాల్లోనూ మల్టీనేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తూ స్థిర పడ్డారు.


ఇన్ఫోసిస్ ప్రతినిధుల నుంచి ఒప్పంద పత్రం అందుకుంటున్న 'గేట్స్' కళాశాల సిబ్బంది

విద్య అందించడంలో సంతృప్తి



బిల్ గేట్స్‌ను ఆదర్శంగా తీసుకుని కళాశాలని స్థాపించాం. ప్రస్తుతం ప్రపంచం అంతా సాంకేతిక పరంగా ఉన్న సమయంలో అడ్వాన్స్ టెక్నాలజీని విద్యార్థుల్లో పెంపొందిస్తున్నాం. ఎన్ఆర్ఐ అయిన తాను అమెరికాలో ఉండాల్సి ఉండగా పేద విద్యార్థుల కోసం ఇక్కడే స్థిర పడ్డాను. తమ కళాశాలలో చదివిన విద్యార్థులు అమెరికాలో ఉద్యోగాలు సంపాదించి తమ ఇంటి పక్కలోనే నివాసం ఉండడం ఆనందాన్ని ఇస్తోంది.

గజ్జల రఘునాథ రెడ్డి, ఎన్ఆర్ఐటి, కళాశాల వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్.

విద్యా నైపుణ్యంపై శిక్షణ



నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలా విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. విద్యా నైపుణ్యంపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. ఎన్ఎస్ఎస్ యూనిట్ ను ఏర్పాటు చేశాం. కళాశాల ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

వికె.శ్రీవాణి, డైరెక్టర్.

ప్రణాలికా బద్ధంగా బోధన



విద్యార్థులకు కష్టపడే మనస్తత్వం పెంపొందిస్తున్నాం. భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు కల్పించుకునేలా శిక్షణ ఇస్తున్నాం. కమ్యూనికేషన్స్, టెక్నికల్ స్కిల్స్‌పై అవగాహన కల్పిస్తున్నాం. ప్రణాలికాబద్ధంగా విద్యాబోధన చేస్తున్నాం. అన్ని విధాలా స్పష్టమైన అవగాహన కలిగేలా చేస్తున్నాం.

వికె.పద్మావతమ్మ, కరస్పాండెంట్.

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

ప్రజా సమస్యల పరిష్కారం కోసం తమవంతు బాధ్యతగా వెలువడుతూ ఉద్యోగ, కార్మిక వర్గాల హక్కుల కోసం వారి వెంట నడుస్తున్న

ప్రజాశక్తి దినపత్రిక

దినదినాభివృద్ధి చెందాలని కోరుతూ..

మీ.. **శ్రేయోభిలాషి**
గార్లదిన్నె గ్రా॥ & మం॥.

ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ప్రజాశక్తి దినపత్రిక

44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

ప్రతి అక్షరం ప్రజల పక్షాన నిలుస్తూ.. నిజాలు నిర్భయంగా ప్రకటిస్తూ.. సమాజాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న "ప్రజాశక్తి" దినపత్రిక దినదినాభివృద్ధి చెందుతూ నేడు 44వ వార్షికోత్సవం జరుపుకుంటున్న శుభవేళ యాజమాన్యానికి, సిబ్బందికి శుభాకాంక్షలు తెలుపుతూ..

ప్రజాశక్తి-అభిమాని

ప్రజాశక్తి శ్రేయోభిలాషి, గుంతకల్లు

ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ప్రజాశక్తి దినపత్రిక

44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

అక్షరమే ఆయుధంగా ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రజా అభిప్రాయాలను ప్రచురిస్తూ 43 వసంతాలు పూర్తి చేసుకొని 44వ వసంతంలోకి అడుగుపెడుతున్న శుభసందర్భంగా "ప్రజాశక్తి" యాజమాన్యానికి, సిబ్బందికి ఇవే మా హృదయపూర్వక శుభాకాంక్షలతో..

మీ...
ఎ.వెంకటేష్ సర్పంచి,
చెర్లోపల్లి గ్రామం, జనసేన పార్టీ నాయకులు, గుత్తి మండలం.

ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ప్రజాశక్తి దినపత్రిక

44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

ప్రజాసమస్యలను నిత్యం వెలుగులోకి తెస్తూ.. ప్రజల పక్షాన నిలుస్తున్న "ప్రజాశక్తి" దినపత్రికకు 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు..

హరినాథ్ రెడ్డి, A.L.M
A.P.S.P.D.C.L,
సొరకాయలపేట గ్రామం,
పామిడి మండలం.

ప్రజాశక్తికి 44వ వార్షికోత్స శుభాకాంక్షలు

నిజాలను నిర్భయంగా సమాజానికి తెలియజేస్తూ... దినదినాభివృద్ధి చెందుతున్న "ప్రజాశక్తి" దినపత్రికకు 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ...

మీ...
ఎమ్.ధనుంజయ
ఎంపీటీసీ, బేతాపల్లి, గుత్తి.

Darul Uloom Faizul islam Madarsa

Ananthapur Raod, Hazrath Tippu Nagar, Gooty.



Shaik Maulana Abdul Haq,
Madarsa Chairman, Gooty.

ప్రజాశక్తికి 44వ వార్షికోత్స శుభాకాంక్షలు

నిజాలను నిర్భయంగా సమాజానికి తెలియజేస్తూ... దినదినాభివృద్ధి చెందుతున్న "ప్రజాశక్తి" దినపత్రికకు 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ...

మీ...

మీ శ్రేయోభిలాషి-పామిడి


తాడేపల్లిలోని ప్రజాశక్తి ప్రధాన కార్యాలయం

ప్రజాశక్తి అప్రతిహత ప్రస్థానం

తెలుగు నేలపై ప్రారంభమైన మొట్టమొదటి దినపత్రిక ప్రజాశక్తి. 1942లో వారపత్రికగా ప్రారంభమై 45లో దినపత్రికగా ఎదిగింది. ఇప్పటికి ప్రజాశక్తి స్వర్ణోత్సవాన్ని కూడా పూర్తి చేసుకుని 79 ఏళ్లుగా పురోగమిస్తోంది. ఈ 79 ఏళ్ల గమనంలో అనేక ఆటుపోట్లను, ఎత్తుపల్లాలనూ అధిగమించింది. 44 ఏళ్ల క్రితం ప్రజాశక్తి దినపత్రికగా పున:ప్రారంభమై నాలుగు దశాబ్దాలు పూర్తి చేసుకుని 44వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సమయం ఇది. ప్రారంభమైంది మొదలు పాఠకుల ఆదరణ, శ్రేయోభిలాషుల సహకారంతో అప్రతిహతంగా పురోగమిస్తోంది. ప్రజా ఉద్యమంలోనూ, పత్రికా రచనల్లోనూ సవ్యసాచిలా రాణించిన మోటూరు హనుమంతరావు సంపాదకత్వంలో, మహానేత పుచ్చలపల్లి సుందరయ్య దార్శనికతలో 1981 ఆగస్టు 1న విజయవాడ కేంద్రంగా ప్రారంభమైన ప్రజాశక్తి అనతి కాలంలోనే ఉమ్మడి రాష్ట్రంలో 10 కేంద్రాలకు విస్తరించింది. నవ్యాంధ్రప్రదేశ్‌లో నేడు 8 కేంద్రాల నుంచి ప్రచురితమవుతోంది. పత్రికా రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికను అందుకోవడానికి ప్రయత్నిస్తోంది. రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా పోరాటాలకు అక్షరసాయాన్ని అందిస్తూ ప్రత్యామ్నాయ జర్నలిజాన్ని ప్రోత్సహిస్తోంది. ప్రజల సహకారం, సిబ్బంది నిబద్ధత ఆధారంగా ప్రజాశక్తి పయనం ముమ్ముందుకు సాగుతోంది. రాష్ట్ర విభజన అనంతరం హైదరాబాద్ నుండి విజయవాడకు తరలి వచ్చిన ప్రజాశక్తి ప్రధాన కార్యాలయం కొన్నాళ్లు అద్దెభవనంలో సాగింది. ఇప్పుడు 2020 నవంబరు 6వ తేదీన రాష్ట్ర రాజధాని కేంద్రం తాడేపల్లిలో నిర్మాణం పూర్తి చేసుకున్న సొంత భవనం నుండి కార్యకలాపాలను సాగిస్తూ అప్రతిహతంగా పురోగమిస్తోంది.



ప్రజాశక్తి వారపత్రికగా నడిచింది. వారపత్రిక తేవడానికి అవసరమైనంత మేరకు కంపోజింగ్, ప్రెస్ ఉన్నాయి. దినపత్రికగా తీసుకురావడానికి చాలా సిబ్బంది కావాలి. యంత్రాంగమూ పెరగాలి. మూడు నెలల ముందు సన్నాహాలు మొదలయ్యాయి. సుందరయ్య ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. మోటూరు హనుమంతరావు పత్రికా నిర్వహణ సంబంధమైన ఏర్పాట్లు చూశారు. ప్రజాశక్తి దినపత్రికగా రాబోతుందన్న వార్త వామపక్ష ప్రగతిశీల వాదులకు ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. నాయకుల ద్వారా దాతలు సహాయ సహకారాలు అందజేశారు. పుచ్చలపల్లి సుందరయ్య అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎ.ఎం.ఎస్ నంబూద్రిపాద్ పత్రిక తొలి ప్రతిని ఆవిష్కరించారు. ఆ సందర్భంగానే సుందరయ్య... కమ్యూనిస్టులు పత్రికను ఎంత విలువైనవిగా పరిగణిస్తారో వివరించారు. అప్పటివరకూ విశాలాంధ్ర మాత్రమే వామపక్ష దినపత్రికగా వెలువడుతుండేది. కమ్యూనిస్టు పత్రికలంటే అదే నమూనాలో ఊహించేవారు. సాధారణ వార్త ఎంత ముఖ్యమైనదైనా, అంతకంటే పార్టీ సంబంధమైన వార్తకే ప్రథమ ప్రాధాన్యతనివ్వడం, ఉద్యమ సంబంధమైన నాయకుల ప్రకటనలు మొదటిపేజీలో ఇవ్వడం ఇందులో ప్రధానాంశం. అయితే ప్రజాశక్తిని కేవలం వ్యూస్ పేపరుగా కాక న్యూస్ పేపర్‌గా తీసుకురావాలని నాయకత్వం భావించింది. అంటే కేవలం పార్టీ సంబంధిత వార్తలు మాత్రమే కాకుండా, అన్ని రకాలైనవి ఇవ్వాలని నిర్ణయమైంది. ఇదో కొత్త ఒరవడి. అయితే దాన్ని సంపూర్ణం గావించడానికి చాలా కాలం పట్టింది. ప్రజాశక్తి దినపత్రిక పున్నప్రారంభమైన కొద్ది రోజుల్లోనే కారల్ మార్క్స్ శతజయంతి ఉత్సవాలు వచ్చాయి. అ పైన సిపిఎం జాతీయ మహాసభలు విజయవాడలో అపూర్వంగా జరిగాయి. ఇవన్నీ కూడా పాఠకులకు ఆసక్తికరమైన సందర్భాలు కావడంతో పత్రిక చురుగ్గా నడిచింది. ఆదివారం అనుబంధం విభిన్నంగా ఉందని అభినందనలు వచ్చాయి. పెద్ద యంత్రాంగం లేకున్నా ఉత్సాహవంతులైన యువ పాత్రికేయులే శ్రమపడి రాస్తుండేవారు.

ప్రత్యేకతలు... ప్రతిబంధకాలు

1984లోనే తొలిసారిగా పరిశ్రమల సంచిక, స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేక సంచికలు విడుదలయ్యాయి. ఇవన్నీ పత్రిక స్థాయి పెరిగేందుకు దోహదపడ్డాయి. 1984లో ఇందిరాగాంధీ హత్య జరిగినప్పుడు ప్రజాశక్తి ప్రచురించిన పెద్ద ఫొటో హిందూ దినపత్రిక తర్వాత అత్యుత్తమంగా ఉన్నట్లు ప్రశంసించారు. ఇవన్నీ ఉన్నా న్యూస్ ప్రింట్ వ్యయం, జీతభత్యాలు వగైరాలు పెరగడంతో, పత్రిక నిర్వహణ కష్టంగా మారింది. అడ్వర్‌టైజ్‌మెంట్లు చాలని స్థితి. ఆ దశలో యాజమాన్యం ఆరు పేజీల పత్రికను నాలుగు పేజీలకు తగ్గించాలని నిర్ణయించింది. ఇతర పత్రికల పోటీని తట్టుకోవడమే కష్టంగా ఉన్న తరుణంలో ఉన్న పేజీలను తగ్గించడం, పత్రికల్లో వచ్చే ప్రధాన విషయాలేవీ దెబ్బతినకుండా ముందే తగు ప్రణాళిక తయారైంది. ఏమైనా ప్రజాశక్తి రాజకీయ నిబద్ధత, పాఠకాభిమానం దాన్ని నిలబెట్టాయి.

ఈ కాలమంతటా సాంకేతికంగానూ, సిబ్బంది దృష్ట్యాను ప్రజాశక్తి హంగులు సమకూర్చుకుంటూనే వచ్చింది. ఉన్నంతలో అదనపు ఆకర్షణలు, శీర్షికలను జత చేసింది. అన్నిటికన్నా ముఖ్యంగా రాజకీయ నైశిత్యాన్ని నిలబెట్టడంలో విశేష కృషి చేసింది. రాష్ట్రంలోని రాజకీయ సీనియర్ నాయకుల్లో ఒకరుగా, కమ్యూనిస్టు వ్యాఖ్యాతల్లో అగ్రగణ్యుడుగా పేరెన్నికగన్న మోటూరు సంపాదకీయం దానికి పెద్ద పెట్టుబడి కాగా, ఉత్సాహం, అంకితభావం గల సంపాదకవర్గం, యాజమాన్యం, సిబ్బంది దాన్ని ముందుకు నడిపే సైన్యంగా పనిచేశారు. అప్పటికే రంగంలో ఉన్న పత్రికలకు ధీటుగా అది ముందుకు సాగింది.

1984 ఎన్నికల పోరాటంలో ప్రజాశక్తి ఇచ్చిన సమాచారం, ప్రత్యేక ఫీచరింగ్ నినాదాలు వంటివి అందరినీ ఆకర్షించాయి. 1985లో కారంచేడులో దళితులపై హత్యాకాండ జరిగింది. ఆ వార్తను ముందుగా ఇచ్చిన వాటిలో ప్రజాశక్తి ఒకటి. తర్వాత కూడా ఆ వివరాలను ప్రత్యేక ప్రాధాన్యతతో ఇస్తూ వచ్చింది. 1985 మే 25న సుందరయ్య కన్నుమూశారు. పత్రిక మొదటి పేజీలో ఆయన పెద్ద ఫోటోతో రాసిన లీడ్ పాఠకులను కదిలించింది. లౌకిక పార్టీల ఆధ్వర్యంలో సాగిన ఉద్యమాలకు ఎప్పుడూ ప్రజాశక్తి వాణిలా పని చేస్తూ వచ్చింది. దానితో పాటు పలు శీర్షికల ద్వారా రాజకీయ, సైద్ధాంతిక చైతన్యం పంచిపెట్టింది.

1988 డిసెంబర్‌లో వంగవీటి మోహనరంగా హత్యానంతరం అల్లర్లు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. సంయమనంతో, సమతుల్యతతో వ్యవహరించి వాస్తవాలను వెలికితీసి ప్రచురించింది. 1987 తర్వాత రాజీవ్‌గాంధీ బోఫోర్స్ కుంభకోణం దేశాన్ని కుదిపేసింది. ఆ సమాచారాన్ని తేవడంలో ప్రజాశక్తి ప్రముఖ పాత్ర వహించింది. హిందూ దినపత్రిక సహ సంపాదకునిగా ఉన్న ఎన్.రామ్ బోఫోర్స్ కుంభకోణం తాలూకా కీలక పత్రాలను తమ పత్రికలో ప్రచురించడానికి అప్పటి సంపాదకులు అంగీకరించనందున ఇతర పత్రికల ద్వారా విడుదల చేశారు. తెలుగులో ఆయన ప్రజాశక్తిని ఎంచుకున్నారు. బోఫోర్స్ వార్తల ఫీచరింగ్‌తో వచ్చిన ప్రజాశక్తి మార్కెట్లో పెద్ద సంచలనమైంది. ఆ నేపథ్యంలో 1989లో కేంద్రంలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం వచ్చింది. రాష్ట్రంలోని తెలుగుదేశం ఓడిపోయి, కాంగ్రెస్ అధికారం చేపట్టడంతో ప్రజాశక్తి రాజకీయ బాధ్యత పెరిగింది. రాజకీయాంశాలతో పాటు పత్రిక ఆదాయాన్ని పెంచే అడ్వర్‌టైజ్‌మెంట్లు, ఇతర యంత్రాంగాన్ని పెంచుకోవడంపై కేంద్రీకరణ పెరిగింది.

1991లో దశమ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్.రామ్ ప్రజాశక్తి సాంకేతిక పద్ధతులను చూసి ఆనందాశ్చర్యాలు వెలిబుచ్చారు. చేతి కంపోజు నుంచి ఒకేసారి పేజినేషన్‌కు వెళ్లారంటే బూర్జువా దశను దాటి సోషలిస్టు దశలోకి ప్రవేశించారన్న మాట అని చమత్కరించారు. సుందరయ్య రాజకీయాలతో పాటు సాంకేతిక అభివృద్ధి గురించి తనతో తరచూ చర్చించేవారని, ప్రజాశక్తిని చూస్తుంటే ఆయన కలలు నిజమైనట్లు అనిపిస్తోందని రామ్ కరతాళధ్వనుల మధ్య అన్నారు. పదో వార్షికోత్సవానికి సోదర పత్రికల సంపాదకులందరూ హాజరై అభినందించారు.

కొత్త పుంతలు

విద్యుచ్ఛక్తి ఉద్యమంతో మొదలెట్టి ప్రజాశక్తి ప్రజా ఉద్యమాలతో, ప్రపంచీకరణ వ్యతిరేక పోరాటాలతో పూర్తిగా మమేకమైంది. పత్రికలో శీర్షికలు పెరుగుదలే కాక మరింత జనరంజకంగా మారాయి. యంత్రాంగం విస్తరించింది. చిరకాలంగా ఉన్న లోగో సహా అనేక మార్పులు జరిగాయి.

2001లో 20వ వార్షికోత్సవంలో తిరుపతి ఎడిషన్ మొదలైంది. ఇక ఆ తర్వాత చకచకా ఎడిషన్లు పెరిగాయి. ఖమ్మం, కర్నూలు, రాజమండ్రి, కరీంనగర్, శ్రీకాకుళం, ఒంగోలు ఎడిషన్లు వచ్చాయి. ఇంతేకాక వందల సంఖ్యలో కంప్యూటర్ కేంద్రాలు వెలిశాయి. జిల్లా సబ్ సెంటర్లు ఏర్పడ్డాయి. 2004 నుంచి జిల్లాల టాబ్లాయిడ్స్ కూడా మొదలయ్యాయి. సిబ్బంది పెరిగారు. పెరిగిన యంత్రాంగం, విస్తరించిన పునాది, మారిన ధృక్పథం ఇవన్నీ కలిసి ప్రజాశక్తిని తెలుగు పత్రికా లోకంలో ఒక విలక్షణ ప్రగతిశీల పత్రికను చేశాయి. ఫలితంగా దాని ప్రతిష్ట, ప్రజాదరణ పెరిగాయి. 1997లో విశాఖ ఎడిషన్ రాష్ట్రంలో మూడో ఎడిషన్‌గా, 2006 నవంబరు 7వ తేదీన శ్రీకాకుళం ఎడిషన్ రాష్ట్రంలో తొమ్మిదో ఎడిషన్‌గా, ఆ తర్వాత ఒంగోలు పది, అనంతపురం 11 ఎడిషన్‌గా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర విభజన అనంతరం నవ్యాంధ్రప్రదేశ్‌లో ప్రజాశక్తి కొనసాగుతోంది. తెలంగాణలో 2015 మార్చి 21 నుంచి 'నవ తెలంగాణ' పత్రికగా రూపాంతరం చెందింది.

మరిన్ని ఎడిషన్లు

1994లో హైదరాబాదు ఎడిషన్ ప్రారంభమైంది. ఆ ప్రతిపాదనకు మొదట చాలా మంది భయపడ్డారు. కానీ అధునాతన సాంకేతిక సదుపాయాలతో సులభంగానే ఎడిషన్ ప్రారంభమైంది. జయప్రదంగా నడిచింది. ఇది తెలుగులో వామపక్ష పత్రికల చరిత్రలో కొత్త అధ్యాయం. తర్వాత కాలంలో ప్రత్యేక సంచికలు మరింత ఎక్కువగా వచ్చాయి. పత్రిక ఎనిమిది పేజీలైంది. శీర్షికలు పెరిగాయి. కంప్యూటర్ కేంద్రాలు పెరిగాయి. 1999లో పత్రిక కేంద్ర కార్యాలయం విజయవాడ నుంచి హైదరాబాద్‌కు మారింది.

అనంతలో ప్రజాశక్తి ఎడిషన్ ప్రారంభం

2017 ఆగస్టు 7వ తేదీ అనంతపురం జిల్లాలో ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అంతకు మునుపు కర్నూలు ఎడిషన్ కేంద్రంగా అనంతపురం జిల్లా పేజీలు ముద్రణ అయ్యేవి. జిల్లా పాఠకులకు ప్రజాశక్తిని మరింత చేరువ చేయాలన్న ఉద్ధేశంతో ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కేవలం రెండు నెలల వ్యవధిలోనే ఎడిషన్ కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. అప్పటి సమాచార శాఖ మంత్రి, ఇప్పటి రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, అప్పటి ప్రజాశక్తి ఎడిటర్ ఎంవిఎస్.శర్మతో పాటు పలువురు ప్రజాశక్తి అభిమానులు, పాఠకుల సమక్షంలో ఎడిషన్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి జిల్లాలోనే ప్రజాశక్తి పత్రిక ముద్రణ అవుతూ పాఠకులకు ఉదయాన్నే చేరుతోంది.



ప్రజాశక్తి రజతోత్సవ సభలో పాల్గొన్న అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్, ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

మరో మలుపు

1990 ప్రజాశక్తిలో మరో మలుపు. అందులో ఒకటి కంప్యూటర్ల ప్రవేశం. మరొకటి రంగురంగుల ప్రత్యేక సంచికల ప్రారంభం. అప్పటికే పలు దినపత్రికలు కంప్యూటర్లను ప్రవేశ పెట్టాయి. కాస్త ఆలస్యమైనా సమగ్రంగా ప్రజాశక్తి కంప్యూటరీకరణను చేపట్టింది. ఉద్యమ శ్రేయోభిలాషి కొండయ్య అందుకు దోహదపడ్డారు. 1999 మే 19 నుంచి కంప్యూటర్ మీద తేవాలనుకుంది. సిబ్బంది ఉత్సాహం వల్ల మే 1 నుంచే తేగలిగారు. ఇతర పత్రికలు మ్యాటర్ వరకూ కంప్యూటర్‌పై చేసి, లే అవుట్, పేస్టింగ్ చేసేవి. కానీ ప్రజాశక్తి ఒకేసారి పేజీనేషన్ చేయడం విశేషం. కంప్యూటర్ వ్యవస్థను లోతుగా అధ్యయనం చేసిన సిబ్బంది, బాధ్యులు అనేక నూతన ప్రక్రియలను అన్వేషించారు. ఆ విధంగా పత్రిక కొత్త ఆకర్షణ సంతరించుకోవడానికి దోహదపడ్డారు. 1990లో గోదావరి గైడ్ పేరిట పుష్కరాల ప్రత్యేక సంచిక వచ్చింది. ప్రజాశక్తి ప్రత్యేక సంచికలు ప్రతిష్టాత్మకంగా రావడానికి అది నాంది పలికింది.

సీమ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర థామస్ మన్రో

ప్రజాశక్తి - గుత్తి

సున్నితమైన రాయలసీమ సమస్యలను మాటతో కాక సేవతో పరిష్కారం చేసి చూపిన అతికొద్దిమందిలో సర్ థామస్ మన్రో ఒకరు. పరాయి పాలకుడైనా సీమ ప్రజల నిజ జీవన స్రవంతితో కలిసిపోయి ఉదార స్వభావం చాటుకున్నారు మన్రో. 19వ శతాబ్దం తొలి దశలో నాటి రాయలు కీర్తిని మన్రో మరోసారి తలపించారు. సీమకు ఒక రూపు కూర్చి వ్యథలు తీర్చే ప్రయత్నంలో సీమ ఒడిలోనే తనువు చాలించారు మన్రో.

ప్రజా సేవకు ఎల్లలు, హద్దులు లేవని నిరూపించిన పరిపాలనాదక్షుడు సర్ థామస్ మన్రో. 18, 19 శతాబ్దాల్లో బ్రిటీష్ కంపెనీ పరిపాలనా బాధ్యతలు నిర్వర్తించడానికి భారతదేశానికి వచ్చిన వారిలో మన్రో పేరెన్నికగన్నవాడు. రాయలసీమ ప్రజల బాగోగుల కోసం అంకిత భావంతో సేవలందించి ఆదర్శ పురుషుడయ్యారు. ప్రజలకు ఎంతో ఆత్మీయతతో మహోన్నతమైన సేవలందించి తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్మరణీయులుగా సజీవంగా నిలిచిపోయారు మన్రో.


సర్ థామస్ మన్రో (ఫైల్ ఫోటో)

ఆదర్శవంతమైన పాలన అందించిన బ్రిటీష్ దొర
జమిందారీ వ్యవస్థను రద్దు చేసి రైత్వారీ పద్ధతి అమలు
భారత సంస్కృతి పట్ల భక్తి గౌరవాలు
తెలుగు భాష నేర్చుకున్న మహనీయుడు

1807వ సంవత్సరంలో దత్త మండలాలకు ప్రిన్సిపల్ కలెక్టర్‌గా వచ్చిన మన్రో రాయలసీమలో చెల్లాచెదురుగా ఉన్న తెలుగు ప్రాంతాలను 4 జిల్లాలుగా ఏర్పాటు చేయడంతో పాటు వాటిని విభజించి రాయలసీమ స్వరూపాన్ని తీర్చిదిద్దారు. ఆయన కార్యాలయం ఆనాడు అనంతపురంలో ఉండేది. దత్త మండలాలను 37 తాలూకాలుగా విభజించారు. బళ్లారి, కోడికొండ, సిద్దవటంలలో ఉన్న కలెక్టర్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరించి కోడికొండను బళ్లారి జిల్లాలో కలిపి సిద్దవటంలో ఉన్న కార్యాలయాన్ని కడపకు మార్చి కడప జిల్లాగా రూపొందించారు. అనంతపురం, ధర్మవరం, పెనుకొండ, మడకశిర, హిందూపురం సబ్ డివిజన్లను బళ్లారి ప్రాంతం నుంచి వేరు చేసి అనంతపురంలో ఏర్పాటు చేశారు. అప్పటికే పెద్ద జిల్లాగా ఉన్న కడప జిల్లా నుంచి కంభం, దూపాడు, కోవెలకుంట్ల ప్రాంతాలను వేరు చేసి కర్నూలు జిల్లాగా మార్చారు. కడప జిల్లా నుంచి వాయల్పాడు, మదనపల్లె ప్రాంతాలను ఉత్తర ఆర్కాట్‌లోని మరికొన్ని ప్రాంతాలను కలిపి చిత్తూరు జిల్లాగా ఏర్పాటు చేశారు. జమిందారీ వ్యవస్థను రద్దు చేసి రైతులకు ఉపయోగకరంగా ఉండేందు వీలుగా రైత్వారీ పద్ధతిని ఆయన తన రెవెన్యూ విధానంగా రూపొందించారు. ఇది మన్రో విధానంగా చరిత్ర ప్రసిద్ధికెక్కింది. పంట కాలువలు, బావుల నిర్మాణానికి హితోధికంగా ప్రభుత్వ ధన సాయం అందించారు. బీడు పడ్డ చెరువుల్లో పూడిక తీత పనులు చేపట్టారు. గండ్లు పడ్డ చెరువులకు మరమ్మతులు చేయించారు. అతను ఏ గ్రామనికి వెళ్లినా ఆ గ్రామ ప్రజలలో మొక్కలు నాటించి వనాలు పెంచమనేవాడు. అందుకు ఆయన పారితోషికాలు సైతం ఇచ్చేవాడు.



మన్రో సత్రం

ఈయన కలెక్టర్‌గా ఉన్నప్పుడు రాయలసీమలోని ప్రజలు కరువు కాటకాలతో తల్లడిల్లిపోతుంటే వారి బాధను చూడలేక ఉన్నతాధికారుల అనుమతి కోసం నిరీక్షించక అన్ని చర్యలు తీసుకున్నారు. సీమలో అస్తవ్యస్తంగా ఉన్న న్యాయ వ్యవస్థతో పాటు పోలీసు యంత్రాంగాన్ని కట్టుదిట్టం చేసి సక్రమ పద్ధతిలో రూపొందించారు. జిల్లా, తాలూకా ప్రాంతాల్లో పాఠశాలలు ఏర్పాటు చేశారు. భారత సంస్కృతి పట్ల మన్రోకి ఎనలేని భక్తి గౌరవాలు ఉండేవి. తెలుగు వారితో సన్నిహిత సంబంధాలు పెంపొందించుకున్న ఆయన తెలుగు రాయడం, చదవడం, మాట్లాడడం నేర్చుకున్నారు. తెలుగు జిల్లాలో పని చేసే ప్రతి బ్రిటీష్ అధికారి తెలుగు భాషని ఖచ్చితంగా నేర్చుకోవాలి అనే నిబంధన సైతం పెట్టారు. ఫలితంగా ప్రజలు తమ బాధలు ఏమి చెబుతున్నారనే విషయం అధికారులకు, అధికారులు ఏం మాట్లాడుతున్నారనే విషయం ప్రజలకు అర్థమయ్యేది. తద్వారా సమస్యలు త్వరగా పరిష్కారమయ్యేవి. పరాయి దేశీయుడైన మన్రో రాయలసీమ రైతులు, ప్రజల కష్టాలను చూసి ఆ కష్టాలు తానే స్వయంగా అనుభవిస్తున్నట్లు ఆయన నిత్యం చలించిపోయేవారు. ఆయన కింద పని చేసే అధికారులు మన్రోపై ఈర్ష్య చెంది మన్రో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాడని బ్రిటీష్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న రాయలసీమ వాసులు బ్రిటీష్ ఉన్నతాధికారుల చర్య పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.


మన్రో సమాధి

మన్రో నిర్మింపజేసిన గృహం ఒకటి నేటికీ గుత్తి పట్టణంలో ఉంది. ఆయన అధికారిక పర్యటనకు వచ్చిన ప్రతిసారీ అధికారులతో చర్చలు జరిపేవారు. ప్రస్తుతం ఆ విడిది గృహాన్నే మన్రో సత్రంగా పిలుస్తున్నారు. ఇది కూడా కొంత వరకూ శిథిలావస్థకు చేరుకుంది. మహోన్నత వ్యక్తి అయిన సర్ థామస్ మన్రో కర్నూలు జిల్లా పత్తికొండ ప్రాంతంలో పర్యటిస్తున్నప్పుడు 'కలరా' వ్యాధి సోకి బాధపడుతూ తిరుగు ప్రయాణంలో గుత్తి పట్టణానికి రాగా 1827 జూలై 6వ తేదీ గుత్తిలోనే తుది శ్వాస విడిచారు. మరుసటి రోజు అనగా 7వ తేదీ మన్రో పార్థివ దేహాన్ని గుత్తి కోట సమీపంలో సమాధి చేశారు. దీన్ని పునరుద్ధరించక పోవడం వల్ల సగ భాగం శిథిలమైపోయింది. అతని సమాధి వద్దనే ఆ కాలంలో మరణించిన ఆంగ్లేయుల ఉద్యోగుల సమాధులు కూడా ఉన్నాయి. పురావస్తు శాఖ వారు వాటిని స్వాధీనం చేసుకున్నారే కానీ మన్రో సమాధిని పునరుద్ధరించలేకపోయారు. రాయలసీమ ప్రజలకు ఎనలేని సేవలు అందించిన ఆయన(మన్రో) స్మృతికి చిహ్నంగా సమాధిని పునరుద్ధరించాలి. ఆయన సేవలు అందరికీ ఆదర్శ ప్రాయం కావాలి. ఆయన పాలన నేటి పాలకులకు గురుబోధ కావాలి.

ఖనిజసంపదల నిలయం 'అనంత' ..!

అనంతపురం జిల్లా అంటే కరువుకు నిలయంగా పిలుచుకుంటున్నప్పటికీ భూగర్భంలో మాత్రం అనంతమైన సంపదలను కలిగుంది. బంగారం, వజ్రాలు, ఇనుప ఖనిజం లైమ్ స్టోన్, క్వార్జ్ ఇలా రకరకాలైన విలువైన ఖనిజ సంపద అనంతపురం జిల్లా భూగర్భంలో దాగుంది. ఈ ఖనిజ సంపద ఆధారంగా పరిశ్రమలు నెలకొల్పేందుకు వీలున్నా పాలకుల దృష్టి లేక ఇప్పటికీ పేద జిల్లాగానే ఉండిపోయిందన్న విమర్శ ఉంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



బంగారం

ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని రామగిరి మండలంలో బంగారు నిక్షేపాలున్నాయి. ఈ విషయం స్వాతంత్ర్యానికి పూర్వమే గుర్తించి వెలికితీసే పనులు సాగాయి. మధ్యలో అవి ఆగిపోయాయి. తిరిగి ప్రారంభిస్తామన్న ప్రకటనలు వెలువడుతున్నప్పటికీ పాలకుల శ్రద్ధ లేక పనులు మూతపడి ఉన్నాయి. ఇవి కాకుండా జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోనూ కొత్తగా గుర్తించినట్టు ప్రచారం నడుస్తోంది.

వజ్రాల గని

జిల్లాలో అనేక ప్రాంతాల్లో కింబర్‌లైట్ పైప్స్ ఉన్నట్టుగా పరిశోధనాల్లో తేల్చారు. అనేక సంస్థలు ఇప్పటికే అధ్యయనం చేసి తవ్వకాలకై దరఖాస్తులు చేసుకున్నాయి. ప్రధానంగా ఉరవకొండ ప్రాంతంలో ఈ ఖనిజాలు అధికంగా ఉన్నట్టు గుర్తించారు. వజ్రకరూరు, కనగానపల్లి, కళ్యాణదుర్గంలోని తిమ్మసముద్రం ప్రాంతాల్లో ఈ ఖనిజ నిపేక్షాల ఆనవాళ్లు ఉన్నాయి





విలువైన ఇనుప ఖనజం

రాయదుర్గం ప్రాంతంలో విలువైన ఇనుప ఖనిజం ఉంది. డీ.హీరేహళ్ మండలంలోని ఓబుళాపురం, మలప నగుడి, హెచ్.సిద్దాపురం గ్రామాల పరిధిలో విలువైన ఇనుప ఖనిజముంది. ఇది వరకే ఈ ఖనిజాన్ని పెద్దఎత్తున తవ్వి విదేశాలను తరలించి వేలాది కోట్లు ఒకరే వెనకేసుకున్న ఘటనలు చోటు చేసుకున్నాయి. ఇప్పటికీ ఈ ఖనిజం నిలువలు ఇక్కడున్నాయి. దీన్ని వైజాగ్ స్టీల్ పరిశ్రమకు కేటాయించాలన్న డిమాండ్ ఉంది. కాని పాలకులు ప్రభుత్వ రంగం సంస్థలకు కాకుండా ప్రయివేటు వ్యక్తులకు కేటాయించడానికి మొగ్గుచూపుతుండటం గమనార్హం.

ఇతర ఖనిజ సంపద

లైమ్‌స్టోన్, డొలమైట్, అస్‌బెస్టాస్ వంటి ఖనిజాలు తాడిపత్రి ప్రాంతంలో విరివిగా ఉన్నాయి. వీటి ఆధారంగా ఇప్పటికే కొన్ని సిమెంటు పరిశ్రమలు ఇక్కడ ఏర్పాటై ఉన్నాయి. ఇవి కాకుండా డీ.హీరేహళ్, గుత్తి, గుంతకల్లు, చెన్నే కొత్తపల్లి ప్రాంతాల్లో క్వార్జ్ ఉంది. యాడికి, పెద్దవడుగూరు సీటైట్ ఉండగా, అనేక ప్రాంతాల్లో గ్రానైట్ ఉంది. ఇలా విలువైన ఖనిజ సంపద ఉన్నా ప్రయివేటు వ్యక్తులకు లాభాలు చేకూరుతున్నాయి. తప్ప సామాన్యులకు చేకూరుతున్న ప్రయోజనం లేదు.


ప్రజాశక్తి
44వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
దినదినాభివృద్ధి చెందుతూ..
ప్రజల పక్షాన అక్షర సమరం సాగిస్తున్న "ప్రజాశక్తి"
దినపత్రిక 44వ వార్షికోత్సవం జరుపుకుంటున్న
సందర్భంగా మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ..
మీ..
ఎ.బాలరాజు
ట్రాన్స్‌కో కాంట్రాక్టర్, గుత్తి.


ప్రజాశక్తికి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
అనునిత్యం ప్రజా సమస్యల పట్ల స్పందిస్తూ శ్రామిక వర్గ ప్రజల పక్షపాతిగా
ముందుకు సాగుతూ 44వ వసంతంలోకి అడుగు పెడుతున్న
"ప్రజాశక్తి" దిన పత్రికకు, హార్ధిక శుభాకాంక్షలు.
ప్రజాశక్తి శ్రేయోభిలాషి, గుంతకల్లు


ప్రజాశక్తికి 44వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
వార్షికోత్సవం
వాస్తవాలను వెలుగులోకి తెస్తూ.. ప్రజల మన్ననలను
పొందిన "ప్రజాశక్తి" దిన పత్రికకు 44వ వార్షికోత్సవం
శుభాకాంక్షలు .
పి.భరత్ కుమార్, సర్పంచి,
సర్పంచిల సంఘం
గుంతకల్లు నియోజకవర్గ అధ్యక్షులు, యంగన్నపల్లి, గుత్తి (మండలం)